క్రీడా సందడి

కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు



చిత్తూరు క్రీడలు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని చిత్తూరులోని డీఎస్ఏ మెసానికల్ మైదానంలో జరుగుతున్న జిల్లా స్థాయి క్రీడా పోటీలు గురువారంతో ముగిశాయి. మొత్తం 10 అంశాల్లో పోటీలు జరిగాయి. 15 టీమ్‌లను కోచ్‌లు ఎంపిక చేశారు. ఈ టీమ్‌లు త్వరలో తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో జరగనున్న జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొంటాయి. గురువారం జరిగిన పోటీల్లో జిల్లా వ్యాప్తంగా సుమారు 250మంది క్రీడాకారులు పాల్గొన్నారని డీఎస్‌డీవో బాలాజి తెలిపారు.

పండుగ రద్దీ



పూజా సామగ్రి కొనుగోలుదారులతో కిక్కిరిసిన చిత్తూరు చర్చివీధి

చిత్తూరు అర్బన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం తొలి శుక్రవారం సందర్భంగా ప్రజలు వరలక్ష్మీ వ్రతాన్ని జరుపుకోనున్నారు. ఈ క్రమంలో గురువారం మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు పూజా సామగ్రి దుకాణాలు జనంతో నిండిపోయాయి. చిత్తూరులోని చర్చివీధి, రాములగుడివారి వీధి, ఓటీకే రోడ్డు, బజారువీధులన్నీ కిటకిటలాడాయి. మరోవైపు వ్రతం సందర్భంగా పూల ధరలకు రెక్కలు వచ్చాయి. కనకాంబరం కిలో రూ.1200, గులాబీ, బంతిపూలు, చామంతి రూ.350 నుంచి రూ. 400 వరకు పలికింది. జనం తాకిడిని గుర్తించిన ట్రాఫిక్ పోలీసులు చర్చివీధి, తదితర వీధుల్లో వన్‌వేను ఏర్పాటు చేశారు.

తెప్పోత్సవం



వెదురుకుప్పం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలో రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి తెప్పోత్సవం గురువారం శాస్త్రోక్తంగా జరిగింది. ఆలయంలో స్వామిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలు పూర్తిచేశారు. తర్వాత స్వామి మూల విరాట్‌ను సుందరంగా అలంకరించి భక్తులను దర్శనానికి అనుమతించారు. ఉదయం తొమ్మిది గంటలకు ఉత్సవర్లకు స్నపన తిరుమంజనం నేత్రానందంగా నిర్వహించారు. సాయంత్రం తిరువీధి ఉత్సవం జరిగింది. తర్వాత స్కంద పుష్కరిణిలో ఏర్పాటు చేసిన తెప్పపై ఉత్సవర్లను అధిష్ఠింపజేశారు. మేళతాళాలు, భక్తుల గోవిందనామ స్మరణల నడుమ స్వామి, అమ్మవార్లు తెప్పలపై ఏడు చుట్లు విహరించారు. ఈ సందర్భంగా టీటీడీ హిందూ, ధర్మప్రచార పరిషత్, అన్నమాచార్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక, భక్తి, సంగీత కార్యక్రమాలను నిర్వహించారు. తర్వాత శుద్ధి, ఏకాంత సేవ జరిగింది. ఏఈవో రవి, ఏఈఈ మురళీమోహన్, ఆలయ ఇన్‌స్పెక్టరు సురేష్‌కుమార్, వేదపండితులు శబరీష్, రమేష్, గోపాలాచారి, షరాబు బాబుసురేష్, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌సీసీ వింగ్ ఎస్‌ఏలకు బదిలీ రీకౌన్సెలింగ్



బదిలీ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఈవో వరలక్ష్మి తదితరులు

చిత్తూరు సెంట్రల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): సాంకేతిక పొరబాట్ల కారణంగా నష్టపోయిన స్కూల్ అసిస్టెంట్ (బయాలజీ-ఎన్‌సీసీ) వింగ్ టీచర్లకు గురువారం బదిలీ రీకౌన్సెలింగ్ నిర్వహించారు. రాష్ట్ర విద్యాశాఖ కమిషనర్ ఆదేశాలతో డీఈవో వరలక్ష్మి చాంబర్‌లో ఈ కౌన్సెలింగ్ జరిగింది. తమకు ఎన్‌సీసీ సర్టిఫికెట్ ఉందని 42 మంది ఎస్‌ఏలు ఆన్‌లైన్‌లో పొందుపరిచినా అప్‌డేట్ కాలేదు. దీనివల్ల బదిలీల్లో తాము నష్టపోయామని విద్యాశాఖ కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో రీకౌన్సెలింగ్ నిర్వహించాల్సి వచ్చింది.

పోక్సో కేసులో యువకుడికి 20 ఏళ్ల జైలు



చిత్తూరు లీగల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులో ఓ యువకుడికి 20 ఏళ్ల జైలు శిక్ష విధించారు. వెదురు కుప్పం మండలం మొండివెంగనపల్లెకు చెందిన లోకేష్ చంద్రగిరిలో ఉద్యోగం చేస్తుండేవాడు.ఓ 14 ఏళ్ల బాలికకు మాయ మాటలు చెప్పి పెళ్లి చేసుకున్నాడు. బాలిక తల్లిదండ్రులు తమ కుమార్తె కనిపించడం లేదని 2022 ఫిబ్రవరి 4వ తేదీన చంద్రగిరి పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి.. నిందితుడిని పట్టుకుని రిమాండుకు తరలించారు. ఈ కేసు గురువారం చిత్తూరు జిల్లా కోర్టు సముదాయాల ఆవరణలోని పోక్సో కోర్టులో వాయిదాకు వచ్చింది. పూర్వాపరాలు పరిశీలించాక లోకేష్‌పై నేరం రుజువు కావడంతో 20 ఏళ్ల జైలుశిక్ష, రూ.9,500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి శంకరరావు తీర్పు చెప్పారు. ఈ కేసును స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మోహన్ కుమారి వాదించారు.

నేతన్నల కళ్లలో వెలుగులు



నగరి, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి):కూటమి ప్రభుత్వం మరో హామీ అమల్లోకి రావడంతో చేనేత కార్మికుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.ఉచిత విద్యుత్ అనేది చేనేత, మరమగ్గాల కార్మికుల దశాబ్దాల డిమాండు.గత వైసీపీ ప్రభుత్వం ఈ విషయంలో హామీ ఇచ్చి నెరవేర్చని విషయం తెలిసిందే.ఈ నేపథ్యంలో గత ఏడాది ఎన్నికల ప్రచార నిమిత్తం వచ్చిన తెలుగుదేశం అధ్యక్షుడు చంద్రబాబు తాము అధికారంలోకి వస్తే ఉచిత విద్యుత్ ఇస్తామని హామీ ఇచ్చారు.ఆ మేరకు చేనేత కార్మికులకు 200యూనిట్లు, మరమగ్గ కార్మికులకు 500యూనిట్ల దాకా ఉచిత విద్యుత్ అందించేందుకు మార్చి 16న మంత్రివర్గ సమావేశంలో నిర్ణయించారు.నగరి నియోజకవర్గ పరిధిలో 4226మరమగ్గాలున్నాయి.తిరుపతి జిల్లాలో 1626, చిత్తూరు జిల్లాలో 3649 మరమగ్గాలకు విద్యుత్ సర్వీసులున్నాయని ట్రాన్స్‌కో అధికారులు తెలిపారు.చేనేతలకు విద్యుత్ కనెక్షన్లు తిరుపతి జిల్లాలో 1720వుండగా చిత్తూరు జిల్లాలో 84 వున్నాయి.వీరందరికీ అలాగే చేనేత, మరమగ్గ వస్త్రాలపై జీఎస్టీ రద్దు చేయడంతో ధరలు తగ్గి వ్యాపారం జోరందుకుంటుందని కార్మికులు ఆశపడుతున్నారు.



నగరి ఎన్నికల ప్రచారంలో ఉచిత విద్యుత్‌పై హామీ ఇస్తున్న చంద్రబాబు(ఫైల్ ఫొటో)

పదేళ్ల పోరాటం నెరవేరింది



ఉచిత విద్యుత్ సదుపాయం కల్పించాలని పదేళ్లుగా చేసిన పోరాటం నెరవేరింది.చితికిపోయిన మరమగ్గ కార్మికుల జీవితాల్లో వెలుగులు నిండే అవకాశం ఏర్పడింది. నాకు నెలనెలా రూ.3,600 విద్యుత్ బిల్లు వచ్చేది. ఇక ఈ డబ్బు కుటుంబ అవసరాలకు ఉపయోగపడుతుంది.

- సుబ్రమణి,మరమగ్గ కార్మికుడు, కేవీఆర్ పేట

కూటమి ప్రభుత్వం ఊపిరిపోసింది



విద్యుత్ చార్జీల పెరుగుదల కారణంగానే సగానికి పైగా మరమగ్గాలు మూసివేసి కూలీ పనులకు వెళుతున్నారు.ఉచిత విద్యుత్ ప్రకటన మరమగ్గ కార్మికుల జీవితాల్లో ఊపిరి పోసింది.గతంలో ఏ ప్రభుత్వం చేయని పని కూటమి ప్రభుత్వం చేసింది.

- పెరుమాళ్,మరమగ్గ కార్మికుల సంఘం కార్యదర్శి

10న బాల్ బ్యాడ్మింటన్ జట్ల ఎంపిక పోటీలు

నగరి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): తిరుపతి శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం కళాశాల మైదానంలో ఈనెల పదో తేదీన జిల్లా బాల్ బ్యాడ్మింటన్ జూనియర్ బాలుర, సీనియర్ బాలికల జట్ల ఎంపిక పోటీలు జరగనున్నాయి. ఈమేరకు చిత్తూరు బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి బాలాజి తెలిపారు. పూర్తి వివరాలకు 70137 54776 నెంబరును సంప్రదించాలన్నారు.

స్వాతంత్ర్య దినోత్సవాలకు సిద్ధంకండి

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లాస్థాయి స్వాతంత్ర్య దినోత్సవాలకు సిద్ధం కావాలని అధికారులను కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో స్వాతంత్ర్య దిన వేడుకల నిర్వహణపై వివిధ ప్రభుత్వశాఖల అధికారులతో సమీక్షించారు. ఈనెల 15వ తేదీన స్థానిక పోలీసు ట్రైనింగ్ కేంద్రంలో జరిగే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ హాజరవుతున్నట్లు తెలిపారు. ఉదయం 7.45 గంటల నుంచి మధ్యాహ్నం వరకు జరిగే వివిధ కార్యక్రమాలను తిలకించడానికి ప్రజలు హెచ్చుసంఖ్యలో వచ్చే అవకాశం ఉందన్నారు. అందుకు అనుగుణంగా సీటింగ్ అరేంజ్‌మెంట్స్ చేయాలని సూచించారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ చూపిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు, రైతులకు డ్రిప్ పరికరాలు, డీఆర్డీఏ, మెప్మా ఆధ్వర్యంలో శకటాల ప్రదర్శన, స్టాల్స్ నిర్వహించాలని ఆదేశాలిచ్చారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య సమరయోధులను సన్మానిస్తామన్నారు. డీఆర్వో మోహన్‌కుమార్, డీఎఫ్‌వో భరణి, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆరు కుంకీలతో ఆపరేషన్ గజ



కీరమంద ప్రాంతానికి కుంకీలను తరలిస్తున్న మావటీలు

బంగారుపాళ్యం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పంటపొలాలపై దాడులు చేస్తున్న ఏనుగుల ఆట కట్టించేందుకు మరోసారి కుంకీలను అటవీప్రాంతానికి తరలించారు.గురువారం సాయంత్రం బంగారుపాళ్యం మండలంలోని కీరమంద,కొదలమడుగు అటవీ పరిసర ప్రాంతాలకు ఆరు కుంకీ ఏనుగులను తరలించారు.వీటిలో కర్ణాటక రాష్ట్రం నుంచి రప్పించిన రంజన్,దేవ,అభిమన్యు,కృష్ణతో పాటు రామకుప్పం మండలం ననియాల తాండా శిబిరం నుంచి తీసుకొచ్చిన వినాయకం,జయంత్ ఏనుగులున్నాయి. కౌండిన్య అభయారణ్యంలో ఏనుగులు సంచరిస్తున్నాయన్న సమాచారంతో అటవీశాఖ అధికారులు ఈ ఆపరేషన్ మొదలుపెట్టారు.పలమనేరు సబ్ డీఎఫ్‌వో వేణుగోపాల్ ఆధ్వర్యంలో 12మంది మావటీలు,40 మంది అటవీశాఖ సిబ్బంది పాల్గొన్న ఈ ఆపరేషన్‌ను డీఎఫ్‌వో భరణి గురువారం రాత్రి కీరమంద అటవీ ప్రాంతానికి చేరుకుని పర్యవేక్షించారు.

కుంకీలకోసం కళ్లు కాయలు కాస్తున్నాయ్

రోజూవారీ గజ దాడులతో పంటలు కోల్పోతున్న పులిచెర్ల రైతుల ఆవేదన



ఏనుగుల దాడిలో ధ్వంసమైన వరిపంట

కల్లూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): గజ దాడులతో పంటలు కోల్పోతున్న పులిచెర్ల మండల రైతులు కుంకీ ఏనుగులకోసం కళ్లుకాయలు కాచేలా ఎదురుచూస్తున్నారు. బుధవారం రాత్రి కూడా కమ్మపల్లి పంచాయతీలో ఏనుగుల గుంపు బీభత్సం సృష్టించింది. గజరాజుల దాడిలో వరి, వేరుశనగ, మామిడి, అరటి, బెండ పంటలకు అపార నష్టం వాటిల్లింది. తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని చింతలవంక నుంచి బోడబండ మార్గంలో బయలుదేరిన 16 ఏనుగుల గుంపు దేవళంపేట పంచాయతీ గెండేవారిపల్లి చెరువు వద్దకు చేరుకున్నాయి. సమీపంలోని చెరువులో మునిగిన ఏనుగుల గుంపు అక్కడి నుంచి బాలిరెడ్డిగారిపల్లిలోని ప్రవీణ్‌కుమార్‌రెడ్డికి చెందిన మామిడిచెట్లను ధ్వంసం చేశాయి. మోహన్‌రెడ్డికి చెందిన వరినారును తొక్కేసి పశుగ్రాసాన్ని తినేశాయి. సుబ్రహ్మణ్యానికి చెందిన వేరుశనగ పంటను ధ్వంసం చేసిన ఏనుగుల గుంపు రామిరెడ్డికి చెందిన కొబ్బరిచెట్లు, బొప్పాయిచెట్లు, మామిడి, బెండపంటను ధ్వంసం చేశాయి. వీరరాఘవరెడ్డికి చెందిన పశుగ్రాసాన్ని తినేశాయి. దేశిరెడ్డిగారిపల్లిలో జయచంద్రారెడ్డి, జగదీష్‌రెడ్డికి చెందిన అరటితోటను, వరిపంటను ధ్వంసం చేశాయి. అక్కడి నుంచి వచ్చిన దారిలోనే అడవిలోకి చేరుకున్నాయి. గురువారం పగలంతా చింతలవంక వద్ద తిష్ట వేసిన 16 ఏనుగులు చీకటిపడే సమయానికి పంట పొలాల్లోకి చేరుకున్నాయి.అడవిలోకి మళ్లించేందుకు అటవీశాఖ సిబ్బంది విశ్వప్రయత్నం చేసినా ఏ మాత్రం లెక్కచేయని ఏనుగుల గుంపు మామిడితోటల్లోకి చేరుకున్నాయి. గజదాడులతో పూర్తిగా నాశనమైపోతున్న తమను రక్షించడానికి కుంకీ ఏనుగులను పంపి గజ దాడులను అరికట్టాలని రైతులు కోరుతున్నారు.



పంటల వైపు దూసుకొస్తున్న ఏనుగుల గుంపు


కె.శ్రీనివాస్‌కు నేడు
కేవీన్ జయమ్మ స్ఫూర్తి పురస్కారం



ఆంధ్రజ్యోతి మాజీ సంపాదకులు, ఉపన్యాసకులు, సామాజిక సాహిత్య విశ్లేషకులు డాక్టర్ కె.శ్రీనివాస్‌కు కేవీన్ జయమ్మ స్ఫూర్తి పురస్కారాన్ని నేడు ప్రదానం చేయనున్నట్లు రచయిత పలమనేరు బాలాజి ఓ ప్రకటనలో తెలిపారు. పలమనేరు సమీపం మదనపల్లె రహదారిలోని లయన్స్‌క్లబ్ వేదికగా శుక్రవారం మధ్యాహ్నం 2గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో ఆయనకు జ్ఞాపికతో పాటు రూ.25వేలను అందజేయడం జరుగుతుందన్నారు. జర్నలిస్టుగా నాలుగు దశాబ్దాలకు పైగా కె.శ్రీనివాస్ రాసిన కథనాలు, సంపాదకీయాలు, చేసిన ఇంటర్వ్యూలు, సమకాలీన ప్రపంచ చరిత్రను కొత్తకోణంలో చూపిస్తాయన్నారు. తెల్లారని తెలంగాణ, బుల్డోజర్ సందర్భాలు, శ్రీనివాస్ సంపాదకీయాలు, తెలంగాణలో సాహిత్య వికాసం, జూన్ 2, అనేక సందర్భాలు, కొత్త వంతెన, సంభాషణ.... ఇలా తెలుగు ప్రపంచానికి అవసరమైన అన్ని సందర్భాలలో విలువైన ఎన్నో పుస్తకాలను ఆయన వెలువరించారన్నారు.తాపీ ధర్మారావు స్మారక పురస్కారం, సి.వై. చింతామణి అవార్డు, ఎన్.ఆర్. చందూర్ అవార్డు, డి. శ్రీపాదరావు అవార్డు, మాదల వీరభద్రరావు స్మారక పురస్కారం, దేవులపల్లి రామానుజ రావు స్మారక సాహిత్య పురస్కారం,ముప్పా పద్మావతి రంగయ్య పురస్కారం,అరుణ్ సాగర్ విశిష్ట పాత్రికేయ పురస్కారం, ప్రపంచ తెలుగు సమాఖ్య వారి బీఎస్ఆర్ కృష్ణ స్మారక పురస్కారం-2016.. మొదలైన పురస్కారా లను తన రచనలకు కె. శ్రీనివాస్ ఇదివరకు పొందారని ఆయన వివరించారు.

- గంగవరం, ఆంధ్రజ్యోతి

సర్వదర్శనానికి 12 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 12 గంటల సమయం పడుతోంది. గురువారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో ఓ షెడ్డులో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

మంగళవారం హుండీ ఆదాయం: రూ.4.15 కోట్లు

బుధవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 71,144

తలనీలాలు సమర్పించినవారు: 28,889

ఒంపులు తిరుగుతూ సాగే ఏరు.. నిశ్చలంగా నీళ్లు.. ఏటికి అటూఇటూ ఒత్తుగా పెరిగిన మడచెట్లు.. వాలుతూ ఎగురుతూ పక్షులు.. ఏటినీటిలో పడవలు.. వలలు విసురుతూ మత్స్యకారులు.. కేరళ తరహా అందమైన దృశ్యం తిరుపతి జిల్లా చిల్లకూరు మండలంలో కనిపిస్తుంది. కండలేరు క్రీక్‌గా పిలిచే ఈ ఉప్పుటేరు జీవ వైవిధ్యానికి, మత్స్యకారుల జీవనోపాధికి నెలవు. పర్యాటకులకు కనువిందు. కాకపోతే అందుకు తగిన ఏర్పాట్లను ప్రభుత్వం ఈ ప్రాంతంలో చేయాల్సి ఉంది.

- గూడూరు, ఆంధ్రజ్యోతి



మన సుందర్బన్ ఈ ఉప్పుటేరు



ఉప్పుటేరులో గిరిజనుల చేపల వేట



కండలేరు ఏరియల్ వ్యూ



వేటకోసం పడవలు

36 కిలోమీటర్లు విస్తరించిన కండలేరు క్రీక్

గుమ్మళదిబ్బ సముద్ర ముఖద్వారం నుంచి తిప్పగుంటపాళెం వరకు 36 కిలోమీటర్ల వెనుకకు సముద్రపు ఉప్పునీరు ప్రవహిస్తుంది. అదే సమయంలో వెంకటగిరి కైవల్యానది నుంచి వచ్చే మంచినీటి ప్రవాహం గూడూరు మీదుగా చల్లకాలువ, పంబలేరుకు చేరుతుంది. గూడూరు మండలంలోని మిట్టాత్మకూరు ప్రాంతాల నుంచీ, రాపూరు కండలేరు జలాశయం నుంచీ వచ్చే జలాలు పంబలేరువాగుకు చేరుకుంటాయి. ఇవి మనుబోలు మండలం వెంకన్నపాళెం గ్రామం గుండా ప్రవహిస్తాయి. వీటికి మనుబోలు మీదుగా వచ్చే వరదనీరు కూడా జత అయ్యి చిల్లకూరు మండలం తిప్పగుంటపాళెం వద్ద ఉన్న కండలేరుక్రీక్‌లో కలుస్తాయి. ఇక్కడ ఒక చెక్‌డ్యాంను నిర్మించారు. ఈ చెక్‌డ్యాం వరకు అటు ఉప్పునీరు (బ్యాక్‌వాటర్) వస్తుంది. ఇటు మంచినీరు ఈ చెక్‌డ్యామ్‌ను దాటుకుని కండలేరు క్రీక్‌లోకి ప్రవహిస్తోంది. ఈ క్రీక్ ద్వారా గుమ్మళ్లదిబ్బ ప్రాంతంలోని సముద్రంలో జలాలు కలుస్తాయి. దీంతో కండలేరు క్రీక్ ఉప్పుటేరుగా ప్రసిద్ధి చెందింది.

ఉప్పుటేరు ప్రత్యేకత ఇదీ..

కండలేరు ఉప్పుటేరు ప్రత్యేకత ఏమిటంటే ఇటు మంచినీరూ, అటు ఉప్పునీరూ కలవడం. సముద్రంలో లాగా లవణశాతం ఎక్కువ ఉండదు. మధ్యస్థంగా 10 పీపీటీ నుంచి 30 పీపీటీ లోపు మాత్రమే ఈ ఏటిలో ఉంటుంది. దీంతో చేపలు, రొయ్యలు, పీతలు సమృద్ధిగా పెరుగుతాయి. ఈ జలాలు మడ అడవుల పెరుగుదలకు దోహదపడుతాయి. అందుకే ఉప్పుటేరు వెంబడి మడ అడవులు విస్తరించి ఉంటాయి. ఇవి తీరప్రాంతాల కోతను నిలువరిస్తుంటాయి. చేపలు, రొయ్యలు వదిలే లార్వాలు(గుడ్లు) నీటి ప్రవాహంలో కొట్టుకు పోకుండా మడ చెట్లకు చుట్టుకుని ఉంటాయి. అక్కడే పిగిలి, చేపలు, రొయ్యల వృద్ధికి దోహదపడతాయి. ఈ తరహా ముఖద్వారాలు మన దేశంలోని సుందర్బన్ (పశ్చిమ బెంగాల్), గోదావరి (ఆంధ్రప్రదేశ్), కావేరి (తమిళనాడు), మండోవి (గోవా) ప్రాంతాలలో ఉన్నాయి.

అపార మత్స్య సంపద

ఈ క్రీక్‌వెంబడి తిప్పగుంటపాళెం, చేడిమాల, బెస్తపాళెం, అంకులపాటూరు, రామారెడ్డిపాళెం, ఏరూరు, మోమిడి, వరగలి, లింగవరం, తమ్మినపట్నం, గుమ్మళ్లదిబ్బ గ్రామాలున్నాయి. ఈ ప్రాంతంలోని మత్స్యకారులు పడవల్లో ఈ క్రీక్ ద్వారానే గుమ్మళదిబ్బ సమీపంలోని సముద్రంలోకి వేటకు వెళుతుంటారు. తీర గ్రామాల్లోని గిరిజనులు మాత్రం ఉప్పుటేరులోనే చేపలు, రొయ్యలను పట్టుకుని జీవనోపాధి పొందుతున్నారు. ఉప్పుటేరులో రొయ్యలు, పీతలతో పాటు కోడివాయ, వంజరం, చందువ రకం చేపలు దొరుకుతుంటాయి. దీంతోపాటూ క్రీక్ వెంబడి సుమారు రెండు వేల ఎకరాలకు పైగా రొయ్యల చెరువులు ఏర్పడ్డాయి. ఇక్కడ పెరిగే రొయ్యలను అంతర్జాతీయ మార్కెట్‌కు ఎగుమతి చేస్తుంటారు.



మడ అడవులు



ఉప్పుటేరు వెంబడి సాగవుతున్న రొయ్యల చెరువులు



తిప్పగుంటపాళెం చెక్‌డ్యాం



కండలేరు ఉప్పుటేరు

డక్కిలి జడ్పీటీసీ రాజేశ్వరి మృతి



కలిమిలి రాజేశ్వరి (ఫైల్‌ఫొటో)


డక్కిలి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): డక్కిలి జడ్పీటీసీ సభ్యురాలు కలిమిలి రాజేశ్వరి(42) గురువారం మృతి చెందారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఆమె మృతదేహాన్ని వెంకటగిరి పట్టణంలోని విశ్వోదయ కాలేజీ సమీపంలో ఉన్న స్వగృహంలో ప్రజల సందర్శనార్థం ఉంచారు. శుక్రవారం ఉదయం ఆమె స్వగ్రామమైన డక్కిలి మండలం చాపలపల్లి గ్రామానికి తీసుకెళ్తారు. మధ్యాహ్నం 3 గంటలకు అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. సీనియర్ నేత కలిమిలి రాంప్రసాద్ రెడ్డి సతీమణి అయిన రాజేశ్వరి 2013లో చాపలపల్లి పంచాయతీ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా గెలుపొందారు. 2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో జడ్పీటీసీ అత్యధిక మెజార్టీతో విజయం సాధించారు. తన భర్త రాంప్రసాద్‌రెడ్డి సహకారంతో మండలానికి ఒక్కో అంబులెన్సు సొంత డబ్బుతో కొనుగోలు చేసి ప్రజల సౌకర్యార్థం వినియోగించారు. చాపలపల్లిలో రామాలయం నిర్మించడంతో పాటు గ్రామాన్ని ఎంతో అభివృద్ధి చేశారు.


కొయ్యబొమ్మల శిక్షణా శిబిరం

శ్రీకాళహస్తి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్తపేటలో గల కళాసృష్టి కార్యాలయంలో ఢిల్లీకి చెందిన చేనేత జౌళిశాఖ సహకారంతో రెండు నెలలపాటు కొయ్యబొమ్మల తయారీపై శిక్షణ ఇవ్వనున్నట్లు కళాసృష్టి స్వచ్ఛంద సేవా సంస్థ కార్యదర్శి డాక్టర్ గుమ్మడిపూడి దశరథాచారి తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ శిక్షణకు కొయ్యబొమ్మల కళాకారులు మాత్రమే అర్హులని గుర్తుచేశారు. అభ్యర్థులకు చేనేత జౌళిశాఖ నుంచి గుర్తింపు పొందిన హస్తకళల కార్డు ఉండాలని తెలియజేశారు. 18 నుంచి 35 సంవత్సరాలలోపు వయసు కలిగి ఉండాలని పేర్కొన్నారు. శిక్షణ కాలంలో జీతభత్యాలు అందజేస్తామని వివరించారు. చేనేత జౌళిశాఖ సర్టిఫికెట్లు ఇస్తారని వెల్లడించారు. ఆసక్తి గల కళాకారులు పట్టణంలోని కార్యాలయంలో దరఖాస్తులను పొందవచ్చని తెలియజేశారు.

రెండు ద్విచక్ర వాహనాల ఢీ
ముగ్గురికి తీవ్రగాయాలు







ప్రమాదంలో గాయపడ్డ యువకులు

కేవీబీపురం, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): మండలంలోని మఠం గ్రామం వద్ద గురువారం రాత్రి 9 గంటల సమయంలో రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన ఒక వ్యక్తి నింద్ర మండలం కావనూరుకు చెందిన వారుగా తెలిసింది. మరో ఇద్దరి వివరాలు తెలియాల్సి ఉంది. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు 108లో శ్రీకాళహస్తిలోని ఆస్పత్రికి తరలించారు ఎస్‌ఐ, పోలీసులు వెళ్లే సరికే అక్కడి ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అయితే ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని అంటున్నారు. పోలీసులు మాత్రం సంఘటనస్థలంలో ప్రమాదానికి గురైన ద్విచక్ర వాహనాలను స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ నరేష్, ఏఎస్‌ఐ ఇమాన్యుయేల్ తెలిపారు.

నేడు అమ్మవారి ఆలయంలో వరలక్ష్మీ వ్రతం

● ఏర్పాట్లు పూర్తి చేసిన టీటీడీ ● వ్రతానికి 500 టిక్కెట్ల జారీ







భక్తురాలికి వ్రతం టికెట్ అందజేస్తున్న డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్ - టిక్కెట్ల కోసం బారులు తీరిన భక్తులు - సిద్ధమైన ఆస్థాన మండపం

తిరుచానూరు, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): పద్మావతి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం ఉదయం10 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు వైభవంగా వరలక్ష్మి వ్రతం నిర్వహించడానికి టీటీడీ అన్ని ఏర్పాట్లూ చేసింది. ఆస్థానమండపం వేదికగా జరిగే వ్రతానికి గంట ముందుగా టిక్కెట్లు పొందిన భక్తులను అనుమతించనున్నట్లు విజిలెన్సు అధికారులు తెలిపారు. ఆన్‌లైన్, కరెంటు బుకింగ్, సిఫార్సు లెటర్ల ద్వారా 500 టిక్కెట్లు విక్రయించనున్నారు. వ్రతంలో వెయ్యి మంది పాల్గొనే అవకాశం ఉంది. ఉదయం అమ్మవారికి వస్త్రాలంకరణ సేవ మినహా అన్ని ఆర్జిత సేవలను రద్దుచేసినట్లు టీటీడీ తెలియజేసింది. సర్వదర్శనంలోనే అమ్మవారిని దర్శించుకోవాల్సి ఉంటుంది. గేట్ నెంబరు 4(పాతపోలీస్‌స్టేషన్) నుంచి భక్తులను అనుమతించనున్నారు. ఇందు కోసం అక్కడ జర్మన్‌షెడ్లు, క్యూలైన్లు ఏర్పాటు చేశారు. సాయంత్రం మాడవీధుల్లో పద్మావతి అమ్మవారు స్వర్ణరథంపై ఊరేగి భక్తులను కటాక్షించనున్నారు. ఈ సందర్భంగా ఆలయంతో పాటు మాడవీధులు, ఆస్థాన మండపాలన్ని సర్వాంగసుందరంగా ముస్తాబు చేశారు. విద్యుత్ దీపాలంకరణ చేశారు. గురువారం ఉదయం కుంకుమార్చన కౌంటర్‌లో 150 వ్రతం టిక్కెట్లను టీటీడీ అధికారులు విక్రయించారు. అరగంట వ్యవధిలోనే టిక్కెట్లు అయిపోయాయి. టిక్కెట్లు దొరకని భక్తులు నిరాశగా వెనుదిరిగారు.

చేనేతకు ప్రభుత్వం చేయూత



మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

వెంకటగిరి టౌన్, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తోందని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. వెంకటగిరిలోని పద్మశాలి కల్యాణ మండపంలో గురువారం జరిగిన జాతీయ చేనేత దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం చేనేత కార్మికుల సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. జిల్లాలో నేటి నుంచి చేనేత కార్మికులకు 200 యూనిట్లు, పవర్ లూం కార్మికులకు 500 యూనిట్ల విద్యుత్‌ను ఉచితంగా ఇస్తోందన్నారు. జిల్లాలో దాదాపు 29 ప్రాథమిక చేనేత సహకార సంఘాలుండగా వెంకటగిరిలోనే ఏడు సంఘాలు చురుగ్గా పనిచేస్తున్నాయన్నారు. 42వేల మందికి చేనేత కార్మికులకు రూ. 41లక్షల మేర రుణాలు మంజూరు చేశామన్నారు. జాతీయ స్థాయి ఎగ్జిబిషన్లలతో వెంకటగిరి చేనేత ఉత్పత్తులు తమదైన ముద్ర వేసుకుంటున్నాయన్నారు. ఈ ప్రాంతానికి చెందిన లక్కా శ్రీనివాసులు సంత్‌కబీర్ పురస్కారం అందుకోవడం గర్వకారణమన్నారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ చేనేతల సమస్యలు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చొరవ తీసుకుంటామన్నారు. అనంతరం రూ.60లక్షల మేర ముద్ర వీవర్స్ చెక్కును అందజేశారు. హ్యాండ్లూం ఏడీ రమేష్, ఎల్‌డీఎం గుంటూర్ రవికుమార్, రాష్ట్ర పద్మశాలి కార్పొరేష్ డైరెక్టర్ గంగాధర్, ఏఎంసీ చైర్మన్ విశ్వనాథం, లక్ష్మీపతి, సత్యనారాయణ, పులికల్లు రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. కాగా చేనేత దినోత్సవం సందర్భంగా పట్టణంలోని క్రాస్ రోడ్డు వద్ద నిర్వహించిన ర్యాలీలో కలెక్టర్ వెంకటేశ్వర్ పాల్గొన్నారు.







తెలుగు తమ్ముళ్ల డిష్యుం.. డిష్యుం..

నాయుడుపేట/తడ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేటలో గురువారం జరిగిన సూళ్లూరుపేట నియోజకవర్గ టీడీపీ సంస్థాగత ఎన్నికల సందర్భంగా గురువారం ఓజిలి మండల తెలుగు తమ్ముళ్లు ఘర్షణ పడ్డారు. ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, నియోజకవర్గ పరిశీలకుడు శివప్రసాద్ ఎదుటే గొడవకు దిగారు. ఓజిలి మండల అధ్యక్ష స్థానానికి గున్నం మధుసూదనరెడ్డి, బి.విజయకుమార్ నాయుడు, కంకణాల సత్యవరప్రసాద్‌రావు, పాడి వెంకటసుబ్బయ్య పోటీలో నిలిచారు. మధుసూదనరెడ్డికే అధ్యక్ష పదవి ఇవ్వాలంటూ యల్లా సుధాకర్, వెంకటేశ్వర్లు, కోటేశ్వరరావు చెప్పగా.. విజయకుమార్ నాయుడు వర్గం వ్యతిరేకించింది. పార్టీ కోసం కష్టపడి, కేసులు పెట్టించుకున్నామని, మధ్యలో వలసొచ్చిన నాయకులకు ఆ పదవి ఇవ్వరాదంటూ అభ్యంతరం చెప్పడంతో ఘర్షణ మొదలైంది. ఒకరినొకరు తిట్టుకుంటూ, తోసుకుంటూ, కొట్టుకున్నారు. పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో ఈ ఘర్షణకు తెరపడింది. పెళ్లకూరు, నాయుడుపేట, నాయుడుపేట రూరల్ అధ్యక్ష, కార్యదర్శుల ఎంపికలో భాగంగా పోటీ పడే నాయకుల వివరాల సేకరణ ప్రశాంతంగా జరిగింది.

మద్యం తాగి విధులకు హాజరైన టీచర్ అంకయ్య సస్పెన్షన్

తిరుపతి(విద్య),ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): బాలాయపల్లెమండలం జయంపు ప్రాథమిక పాఠశాలలో సెకండరీగ్రేడ్ టీచర్ చిన్న అంకయ్య సస్పెండయ్యారు. రోజూ మద్యం తాగి విధులకు హాజరవుతుండడం.. 4,5తరగతుల విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని నిర్ధారణ కావడంతో సస్పెండ్ చేస్తున్నట్లు డీఈవో కేవీఎన్ కుమార్ గురువారం పేర్కొన్నారు.ఎంఈవో ప్రాథమిక విచారణ జరిపి నివేదించారన్నారు. ఈక్రమంలోనే చిన్న అంకయ్యను సస్పెండ్ చేశామని ఒక ప్రకటనలో వివరించారు.

శ్రీకాళహస్తిలోనూ సర్వం సిద్ధం





బ్రహ్మగుడి ఆలయం వద్ద ఏర్పాట్లు - పసుపు, కుంకుమ తదితరాలను సిద్ధం చేస్తున్న ఆలయ అధికారులు

శ్రీకాళహస్తి, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): శ్రీకాహస్తీశ్వరాలయ ప్రాంగణంలోని బ్రహ్మగుడి వద్ద శుక్రవారం వరలక్ష్మి వ్రతం నిర్వహించడానికి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వ్రతం జరగనుంది. వ్రతంలో పాల్గొనే మహిళలకు ఇచ్చే వాయినాలను అధికారులు, సిబ్బంది సిద్ధం చేస్తున్నారు.

తిరుపతిలో ఎస్టీ విద్యార్థులకు రీజనల్ స్టడీ సర్కిల్

తిరుపతి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పోటీ పరీక్షలకు హాజరయ్యే గిరిజన విద్యార్థులకు శుభవార్త. వీరి కోసం ఏపీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో తిరుపతిలో రీజనల్ స్టడీ సర్కిల్ ఏర్పాటుకానుంది. ఇందుకు ప్రభుత్వం అనుమతించింది. గతేడాది ఆగస్టులో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా సీఎం చంద్రబాబు స్టడీ సర్కిల్ ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ఈక్రమంలోనే విజయవాడతోపాటు తిరుపతిలో రీజనల్ సెంటర్ల ఏర్పాటుకు గురువారం ప్రభుత్వం గురువారంఉత్తర్వులు జారీ చేసింది. వీటి నిర్వహణకు రూ. 4.22 కోట్లు మంజూరు చేస్తూ రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి ముదావత్ .నాయక్ ఉత్తర్వులు జారీ చేశారు.

తిరుమలలో రేపు శ్రావణ పౌర్ణమి గరుడసేవ

తిరుమల, ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): శ్రావణ పౌర్ణమి సందర్భంగా తిరుమలలో శనివారం గరుడసేవ నిర్వహించనున్నారు. శ్రీమలయప్పస్వామి గరుడునిపై కొలువుదీరి మాడవీధుల్లో ఊరేగి భక్తులకు దర్శనమివ్వనున్నారు. సెప్టెంబరు 24న మొదలయ్యే బ్రహ్మోత్సవాల్లో 28న గరుడసేవ ఉంటుంది. దీనికి ట్రయల్‌రన్‌గా శనివారం గరుడసేవను భావిస్తారు. లోటుపాట్లను గుర్తించి బ్రహ్మోత్సవాల్లో ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోనున్నారు.



లాఠీ దెబ్బలు తట్టుకోలేక విలవిలలాడుతున్న పవన్



తిరుపతిలో మళ్లీ పడగవిప్పిన అరాచకం

తిరుపతిలో అరాచక భూతం మళ్లీ నిద్రలేచింది. కాస్త ప్రశాంత వాతావరణం ఏర్పడుతోంది అనుకునేలోగానే విచ్చలవిడి దాడులకు తెగబడుతున్నారు. దబాయింపులు.. దౌర్జన్యాలు.. హింసాత్మక సంఘటలూ పెచ్చుపెరుగుతున్నాయి. గురువారం సోషల్ మీడియాలో వైరల్ అయిన దృశ్యాలు నగర ప్రజలను భయకంపితులను చేశాయి. బకాయి ఉన్నాడంటూ ఒక దళిత యువకుడిని పోలీసులు వాడే ఫైబర్ లాఠీతో విచక్షారహితంగా కొడుతున్న దృశ్యాలు చూసిన వారి ఒళ్లు జలదరించింది.

తిరుపతి (నేరవిభాగం), ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కాళ్లతో తన్నారు. ఫైబర్ లాఠీతో చితకబాదారు. దుడ్డు కర్రతో విచక్షణారహితంగా కొట్టారు. ఒళ్లంతా రక్తమైనా, అన్నా.. వదలంటూ కాళ్లు పట్టుకున్నా, కనికరించలేదు. వైరల్ అయిన ఈ దాడి దృశ్యాలు పోలీసులకు చేరడంతో రంగంలోకి దిగారు. మరోవైపు బాధితుడి తండ్రి పిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. తిరుపతి పోలీసుల కథనం మేరకు.. చిత్తూరు జిల్లా పులిచెర్ల మండలం మొరవపల్లికి చెందిన నీలం జయరాజ్ కుమారుడు పవన్‌కుమార్ తిరుపతిలోని ఓ రెసిడెన్సీలో రిసెప్షనిస్టు. తిరుపతి వైసీపీ సోషల్ మీడియా విభాగం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి కారు డ్రైవర్ అయిన అనిల్‌కుమార్‌రెడ్డి శ్రీనివాసం ఎదురుగా ఎస్వీపీ బైక్ రెంటల్స్ పేరిట ద్విచక్ర వాహనాలను అద్దెకు ఇస్తున్నాడు. నెల కిందట పవన్‌కుమార్ డియో హోండా బైక్‌ను అద్దెకు తీసుకున్నాడు. దాదాపు 20 రోజులుగా బాడుగ చెల్లించలేదు. ఈ క్రమంలో స్విమ్స్ వద్ద ఉన్న పవన్, అతడి స్నేహితుడిని అనిల్ అనుచరుడు, మరో బైక్ రెంటల్ యజమాని జగదీశ్వర రెడ్డి అలియాస్ జగ్గూ, అజయ్‌కుమార్ బుధవారం మధ్యాహ్నం అనిల్‌కుమార్‌రెడ్డి కార్యాలయానికి తీసుకొచ్చారు. అంతలో పాకాలకు చెందిన.. కొర్లగుంటలో ఉంటూ ఫైనాన్సు, సెటిల్‌మెంట్లు చేస్తున్న వైసీపీ నేత దినేష్ అక్కడకు చేరుకున్నాడు. ఫైబర్ లాఠీతో పవన్‌ను విచక్షణా రహితంగా దినేష్ కొట్టాడు. ఒళ్లు రక్తంతో కమిలిపోయి అన్నా.. కొట్టొద్దు.. కొట్టొద్దు అంటున్నా విడిచిపెట్టలేదు. చిత్రహింసలకు గురిచేశాడు. అనిల్‌కుమార్ రెడ్డి కూడా లాఠీతో చితకబాదాడు. ఈ ఘటనను పవన్ స్నేహితుడు వీడియోలు తీసి గ్రూపుల్లో వైరల్ చేశారు. ఈ వీడియోలను నీలం జయరాంకు అనిల్ పంపి.. మీ కుమారుడు మాకు డబ్బులివ్వాలని చెప్పడంతో తాను వచ్చి ఇస్తానని ఆయన చెప్పారు. అక్కడ్నుంచి పవన్‌కుమార్‌ను పంపేశారు.



ఈస్ట్ పోలీసు స్టేషన్‌లో అనిల్‌రెడ్డి

పలు సెక్షన్ల కింద కేసులు: డీఎస్పీ

నిందితులు అనిల్‌కుమార్ రెడ్డి, దినేష్, జగదీశ్వర రెడ్డిను అదుపులోకి తీసుకుని కిడ్నాప్, హత్యాయత్నం, ఎస్సీ, ఎస్టీ, చిత్రహింసలకు గురి చేయడం వంటి సెక్షన్ల కింద కేసులు నమోదు చేసినట్లు తిరుపతి డీఎస్పీ భక్తవత్సలం గురువారం చెప్పారు. వీరిపై రౌడీ షీట్ ఓపన్ చేస్తామన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారెవరైనా వదలి పెట్టేది లేదన్నారు. ఈ దాడి ఘటనలో నిందితులైన వైసీపీ నాయకులపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి వంగలపూడి అనిత పోలీసులను ఆదేశించారు. ఈ ఘటన వెనుక సూత్రధారులను వదలిపెట్టేది లేదన్నారు.

పవన్ ఎక్కడ?

ఈ ఘటన తర్వాత పవన్ కనిపించలేదు. ఆయన మొబైల్ ఆన్ చేసి.. తర్వాత ఆఫ్ చేస్తున్నారు. ఇతడి కోసం సీఐ రామయ్య, సిబ్బంది గాలించారు. కల్లూరు మండలం ఇస్త్రాకులపల్లె వద్ద స్నేహితుడు జానకిరామ్‌తో పవన్ ఉన్నట్లు గుర్తించి వెళ్లారు. అప్పటికే పవన్ వెళ్లిపోగా, జానకిరామ్‌ను మాత్రం గురువారం రాత్రి తిరుపతికి తీసుకొచ్చారు.

అదుపులో ముగ్గురు నిందితులు

కాగా, వైరల్ అయిన వీడియోలు పోలీసులకూ చేరాయి. నిందితులను పట్టుకునేందుకు డీఎస్పీ భక్తవత్సలం నేతృత్వంలో వర్సిటీ సీఐ రామయ్య, ఈస్ట్ ఎస్ఐ గిరిబాబు, ఈస్ట్ హెడ్ కానిస్టేబుల్ జ్యోతినాథ్, సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. పద్మావతి పురంలో ఉన్న అనిల్‌ను అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల హెచ్చరికలతో బుధవారం అర్ధరాత్రి జగదీశ్వరరెడ్డి ఈస్ట్ స్టేషన్‌లో లొంగిపోయాడు. వీరిని విచారించాక దినేష్, అజయ్‌కుమార్ కూడా ఉన్నట్లు తెలిసింది. గురువారం సాయంత్రం దినేష్‌ను చింతలచేను బస్టాపు వద్ద అదుపులోకి తీసుకున్నారు. ఈ ముగ్గురు పోలీసుల అదుపులో ఉండగా, అజయ్‌కుమార్ పరారయ్యాడు. వున్నారు. బాధితుడి తండ్రి జయరాజ్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

రూ.5 లక్షలు ఇవ్వకుంటే శవాన్ని పంపిస్తాం

- నిందితులు బెదిరించారంటూ పవన్ తల్లి ఆవేదన



'మీ కొడుకు మావద్ద బైక్ రెంటల్‌కు తీసుకుని డబ్బులు ఇవ్వలేదు. అతడిని కొట్టిన వీడియోలు మీకు పంపాము. రూ.5 లక్షలు సాయంత్రానికంతా (బుధవారం) పంపకుంటే మీ కొడుకు కిడ్నీ తీసుకుని, శవాన్ని ఇంటికి పంపిస్తామని మాకు రెండు, మూడు నెంబర్ల నుంచి ఫోన్ చేశారు. మేము భయపడి పోయి మా కొడుకుని కాపాడాలంటూ తిరుపతి పోలీసులకు పిర్యాదు చేశాం' అంటూ పవన్ తల్లి సునీత గురువారం ఈస్ట్ పోలీసు స్టేషన్ వద్ద ఆవేదన వ్యక్తంచేశారు. 'తప్పు చేస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలి. అంతేకానీ రక్తం వచ్చేట్లు లాఠీతో కొట్టడానికి వీళ్లెవరు? బాగా కొట్టి.. ఇప్పుడు కనిపించకుండా చేశారు. వెంటనే నిందతులను అరెస్టు చేసి నా బిడ్డను కాపాడాలి' అంటూ ప్రాధేయపడ్డారు. ఆమెకు మద్దతుగా అంబేడ్కర్ సంఘం జిల్లా నాయకులు ధనశేఖర్, రమేష్, సమతా సైనిక దళ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు చిరంజీవి, ఎస్సీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ప్రసాదరావు తదితరులు ధర్నా చేశారు.

ఆగని వైసీపీ అరాచకాలు

తిరుపతి/ తిరుపతి(నేరవిభాగం), ఆగస్టు 6 (ఆంధ్రజ్యోతి): అధికారంలో ఉన్నప్పుడే కాదు.. ఇప్పుడూ తిరుపతిలో వైసీపీ అరాచకాలు ఆగలేదు. కొన్ని ఘటనలు చూస్తే..

ఎన్నికల ప్రచారంలో ప్రశ్నించాడని..

వారం కిందట తిరుమల బైపాస్ రోడ్డులో నడుచుకుంటూ వస్తున్న చందు(19)ను ఎర్రమిట్టకు చెందిన వైసీపీ నేత రాఖీ, మరో 17 మందితో కలసి బాటిల్ పగలగొట్టి పొడిచేశారు. వైసీపీ అభ్యర్థి అభినయ్ ఎన్నికల ప్రచారానికి వచ్చినప్పుడు 'ఆయన తిరుపతికి ఏమి చేశాడు?' అని చందు వ్యాఖ్యానించినట్లు వైసీపీ నాయకుల దృష్టికి వచ్చినట్టు సమాచారం. దీంతో వారం క్రితం తిరుపతికి వచ్చిన చందుపై గంజాయి బ్యాచ్‌ను వేసుకుని దారుణంగా పొడిచారు. కుటుంబీకులు రుయాస్పత్రికి తీసుకెళ్లి మెడికో లీగల్ కేసుగా నమోదు చేయించారు. ఓ వైసీపీ కార్పొరేటర్ ఒత్తిడితో అలిపిరి పోలీస్ స్టేషన్‌లోని ఓ ఎస్ఐ కేసు నమోదు చేయడానికి ఆసక్తి చూపలేదన్న ఆరోపణ వచ్చింది. దీనిపై బాధితులు గట్టిగా పట్టుబట్టడంతో పిటీ కేసు పెట్టి వదిలేశారని తెలిసింది. దీనిపై బాధితులు ఎస్పీ కార్యాలయంతో పాటు, మానవహక్కుల కమిషన్‌కు కూడా ఫిర్యాదు చేసేందుకు సిద్ధమైనట్టు సమాచారం.

సెటిల్మెంట్ల చైతన్య

అభినయ్ ప్రధాన అనుచరుడు, ఎస్టీవీనగర్‌కు చెందిన చైతన్యకుమార్ యాదవ్ గత నెలలో చింతలచేను వద్ద ఓ కార్ డెకార్స్‌కు సంబంధించి దుకాణం ఇచ్చేయాలంటూ దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. లీలామహల్ రోడ్డులో కృష్ణ కాంప్లెక్సులో ఓ గది అద్దెకు తీసుకుని బాడుగ చెల్లించలేదు. ఖాళీ చేయలేదు. దీంతో గది యజమాని రూము ఖాళీచేసి ఇతరులకు బాడుగకు ఇచ్చారు. దీంతో చైతన్య వెళ్లి కార్యాలయంలోని అద్దాలు, పర్నిచర్ ధ్వంసం చేశాడు. ఈ రెండు ఘటనల్లో కేసులు నమోదయ్యాయి. వైసీపీ హయాంలో సూపర్ పోలీస్‌గా ఇతడు వ్యవహరించాడన్న ప్రచారం ఉంది. ఉన్నత స్థాయి అధికారులు సైతం చైతన్య చెప్పిందే చేయాలన్న ఆదేశాలు వైసీపీ నేతలు ఇచ్చారన్న విమర్శలున్నాయి. ఇప్పుడూ కొందరి పోలీసుల సహకారంతోనే సెటిల్మెంట్లు చేస్తున్నాడన్న ప్రచారం జరుగుతోంది.

అనిల్ రెడ్డికి ఇలాంటివి కొత్తేమీ కాదు

పవన్‌పై అమానుషంగా దాడికి పాల్పడిన ఘటనకు కారణమైన అనిల్‌రెడ్డి ఇటీవల 14వ డివిజన్లో టీడీపీ జెండాపైన వైసీపీ జెండా కట్టి రాజకీయ విద్వేషాలు రెచ్చగొట్టారు. దీనిపై టీడీపీ నేతలు పోలీసులకు ఫిర్యాదుచేసినా ప్రయోజనం కనిపించలేదు.

రౌడీల ఆగడాలు సాగనివ్వం : ఎస్పీ



తిరుపతిలో రౌడీల ఆగడాలు సాగనివ్వబోమని ఎస్పీ హర్షవర్ధనరాజు హెచ్చరించారు. పవన్‌పై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షిస్తామన్నారు. హోంమంత్రి అనిత ఆదేశాల మేరకు ఘటన జరిగిన వెంటనే నిందితులను అదుపులోకి తీసుకున్నామన్నారు.

కడా పీడీ పనితీరుపై అభిప్రాయ సేకరణ



కడా పీడీ వికాస్ మర్మత్

కుప్పం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడా) పీడీ వికాస్ మర్మత్‌పై ప్రభుత్వం మొబైల్ సందేశాలతో కుప్పం నియోజకవర్గ ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ చేస్తోంది. నియోజకవర్గ ప్రజలకు 864536196 అనే నెంబర్ నుంచి కాల్ వస్తోంది. ఫోన్ తీయగానే 'కడా పీడీ వికాస్ మర్మత్ పనితీరుపై మీరు సంతృప్తిగా ఉన్నారా? అయితే 1 నొక్కండి, అసంతృప్తిగా ఉన్నారా? అయితే 2 నొక్కండి' అన్న సందేశం వినిపిస్తోంది. గురువారం నుంచి ఇటువంటి సందేశాలు పలువురు ప్రజలకు కాల్స్ వచ్చాయి. నియోజకవర్గంలో పనిచేస్తున్న అధికారులు, వారి పనితీరుపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంత అప్రమత్తతతో, మరెంత జాగ్రత్తతో, బాధ్యతతో ఉన్నారో ఈ సందేశాలు తెలియజేస్తున్నాయి. నియోజకవర్గ అభివృద్ధికి అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఆయన కోరుకుంటున్నారు. ప్రజల నుంచి అభిప్రాయ సేకరణ చేయిస్తున్నారు. ఇదే తీరులో మరికొందరు డివిజన్ స్థాయి అధికారుల పనితీరుపై ప్రభుత్వం మొబైల్ సందేశాలతో భవిష్యత్తులో ప్రజల నుంచి అభిప్రాయం సేకరించే అవకాశం ఉందని అధికార వర్గాల్లో చర్చ జరుగుతోంది.

మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే చర్యలు



బియ్యాన్ని పరిశీలిస్తున్న ఎంఈవో తిరుమలమ్మ

చౌడేపల్లె,ఆగస్టు7(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనంలో నాణ్యత లోపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంఈవో-2 తిరుమలమ్మ హెచ్చరించారు. గురువారం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో పుదిపట్ల హైస్కూల్‌లో పురుగులన్నం అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. ఇందుకు స్పందించిన ఆమె డీటీ రామ్మూర్తి, చిత్తూరు సీఎస్‌డీటీ పయణిలతో కలిసి పుదిపట్ల హైస్కూల్లో మధ్యాహ్న భోజనం తనిఖీ చేశారు. విద్యార్థులకు అందించే భోజనం నాణ్యతగా, రుచిగా, శుభ్రంగా ఉండాలన్నారు. అనంతరం బియ్యం బస్తాలను తనిఖీ చేశారు. బియ్యం బస్తాల్లో ముక్క పురుగులు ఉండటంతో ఆ బియ్యాన్ని గోదాముకు తిరిగి పంపి మంచి బియ్యాన్ని పంపాలని సూచించారు. అలాగే హెచ్ఎం పద్మజను మధ్యాహ్నం భోజనంపై పర్యవేక్షించాలని సూచించారు.

చేనేత కార్మికులను ఆదుకుంటున్న ప్రభుత్వం

- డీఆర్వో మోహన్‌కుమార్



చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం అన్నివిధాలా ఆదుకుంటోందని డీఆర్వో మోహన్‌కుమార్ తెలిపారు. ఇందులో భాగంగానే చేతి మగ్గాలకు 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పథకాన్ని ప్రకటించిందన్నారు. గురువారం జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా నగరంలో జిల్లా చేనేత శాఖ ఆధ్వర్యంలో పెద్దఎత్తున ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ.. జిల్లావ్యాప్తంగా 600 చేనేత మగ్గం కుటుంబాలు ప్రత్యక్షంగా, పరోక్షంగా మగ్గం వృత్తిపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారన్నారు. ఈ కుటుంబాలు ఎక్కువగా పెనుమూరు, సదుం, సోమల, నగరి, కార్వేటినగరం మండలాల్లో ఉన్నాయని చెప్పారు. జిల్లాలో 10 చేనేత సహకార సంఘాలు ఉన్నాయని, వాటిలో ఐదు మాత్రమే సక్రమంగా పనిచేస్తున్నట్లు తెలియజేశారు. జాతీయ హ్యాండ్‌లూమ్ అభివృద్ధి పథకం కింద పెనుమూరులో క్లస్టర్ అభివృద్ధి కార్యక్రమం చేపడుతున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా పలువురు చేనేత కార్మికులను సత్కరించారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

బాలల సంక్షేమంపై దృష్టి పెట్టాలి

- కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు అర్బన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): బాలల సంక్షేమంపై దృష్టి పెట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. గురువారం నాగయ్య కళాక్షేత్రంలో తల్లిపాల వారోత్సవం, శిశు సంబంధిత చట్టాలపై అవగాహన కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి నెలా మొదటి, మూడో శుక్రవారం గ్రామ, వార్డుస్థాయిల్లో బాలల సంక్షేమం, పరిరక్షణ కమిటీ సమావేశాలను నిర్వహించాలని చెప్పారు. మహిళా పోలీసులు క్రమం తప్పకుండా బాలల సంరక్షణ కేంద్రాలు, పాఠశాలలను సందర్శించాలన్నారు. బాలల అక్రమ రవాణా, లైంగిక వేధింపులపై నిత్యం నిఘా ఉండాలని ఆదేశాలిచ్చారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషకాహార లోపంతో ఉన్న పిల్లలను గుర్తించి, పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. సమావేశంలో ఏఎస్పీ రాజశేఖర్‌రాజు, స్త్రీశిశు సంక్షేమ శాఖ పీడీ వెంకటేశ్వరి, బాలల సంరక్షణ అధికారి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీ పక్కాగా వసూలు చేయాలి

వాణిజ్య పన్నుల అధికారులకు కలెక్టర్ సూచన

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): జీఎస్టీ (గూడ్స్ సర్వీస్ ట్యాక్స్) పక్కాగా వసూలు చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో తన అధ్యక్షతన వాణిజ్య పన్నులు, వివిధ పన్నుల శాఖల అధికారులతో జరిగిన సమన్వయ సమావేశంలో ప్రసంగించారు. వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నా.. పన్ను పరిధిలోకి రాకుండా లోపాయికారీ ఏర్పాట్లు చేసుకున్న సంస్థలపై ప్రత్యేక నిఘా పెట్టాలని చెప్పారు. డిఫాల్టర్స్ బ్యాంక్ అటాచ్‌మెంట్ అంశాల్లోనూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అన్ని ప్రొఫెషనల్ సర్వీస్ సంస్థలు, విద్యాసంస్థలు, ఇంజనీరింగ్, మెడికల్ ప్రొఫెషనల్స్‌ను తప్పనిసరిగా జీఎస్టీ పరిధిలోకి తీసుకుని రావాలన్నారు. మున్సిపల్ కమిషనర్లు వార్డుల్లో, డివిజన్లలో పర్యటించి సరైన పన్నులు విధించే ప్రక్రియను బలోపేతం చేయాలని స్పష్టం చేశారు. పన్నులు ఎగవేస్తున్న నకిలీ సంస్థలు, వ్యాపారులను గుర్తించి కేసులు నమోదు చేయాలని సూచనలిచ్చారు. మైనింగ్ లైసెన్సులు మంజూరు చేసే ముందు, జీఎస్టీ రిజిస్ట్రేషన్ ధ్రువీకరణ లైసెన్సుల పునరుద్ధరణ సందర్భాల్లో వాణిజ్య పన్నులశాఖ నుంచి నోడ్యూ సర్టిఫికెట్ పొందాలన్నారు. సమావేశంలో చిత్తూరు వాణిజ్య పన్నులశాఖ జాయింట్ కమిషనర్ రవీంద్రనాథ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

36 వేల మామిడి రైతుల సబ్సిడీ వివరాలు పూర్తి

చిత్తూరు సెంట్రల్ , ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ర్యాంపులు, మార్కెట్ యార్డుల్లో తోతాపురి మామిడి కాయలను విక్రయించిన 36,290 మంది రైతులకు సంబంధించి 1.42 లక్షల టన్నుల వివరాలు గురువారానికి ఆన్‌లైన్‌లో నమోదు చేయడం పూర్తి చేసినట్లు మార్కెటింగ్ శాఖ ఏడీ పరమేశ్వరన్ తెలిపారు. చిత్తూరు, బంగారుపాళ్యం మార్కెట్ యార్డు, పలమనేరు శివనికాపు సబ్ మార్కెట్ యార్డు, వి.కోట ప్రైవేటు మార్కెట్ యార్డులతో పాటు 38 ర్యాంపుల్లో 1.42 లక్షల టన్నుల మామిడి విక్రయాలు జరిగాయి. ప్రభుత్వం ప్రకటించిన కిలో మామిడి రూ.4 సబ్సిడీకి సంబంధించి రైతుల వివరాలను నమోదు చేయడం పూర్తి చేసినట్లు ఆయన తెలిపారు. సుమారు రూ.56 కోట్ల దాకా మార్కెటింగ్ శాఖ ద్వారా రైతులకు అందనుండగా,ఆ వివరాలను జిల్లా ఉన్నతాధికారులకు పంపినట్లు తెలిపారు.

జిల్లావ్యాప్తంగా వర్షాలు

చిత్తూరు అర్బన్‌లో అత్యధికంగా 92.4 మిమీ వర్షపాతం నమోదు

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ద్రోణి ప్రభావ కారణంగా ఐదు రోజులుగా జిల్లా అంతటా విస్తృతంగా వర్షాలు కురుస్తున్నాయి. ఆగస్టు నెల సగటు వర్షపాతం 121.2 మిమీ కాగా, గురువారం నాటికి 71.1 మిమీ వర్షపాతం నమోదయ్యింది. గడచిన 24 గంటల్లో జిల్లావ్యాప్తంగా 27 మండలాల్లో తేలికపాటి నుండి భారీవర్షం కురిసింది. చిత్తూరు అర్బన్ మండలంలో అత్యధికంగా 92.4 మిమీ, అత్యల్పంగా నగరిలో 2.4 మిమీ వర్షం కురిసింది. మండలాలవారీగా వి.కోటలో 90.4, తవణంపల్లెలో 85.4, రామకుప్పంలో 80.4, చిత్తూరు రూరల్‌లో 60, గంగవరంలో 58.6, గుడిపాలలో 53.8, సదుం, సోమల మండలాల్లో 37.4, పుంగనూరులో 36.6, పలమనేరులో 35.8, పాలసముద్రంలో 33.2, యాదమరిలో 32.2, శాంతిపురంలో 28.2, గంగాధరనెల్లూరులో 27.0, పెద్దపంజాణిలో 22.4, చౌడేపల్లెలో 19.4, బైరెడ్డిపల్లెలో 17.6, ఐరాల, బంగారుపాళ్యం మండలాల్లో 9.2, రొంపిచెర్లలో 6.4, పులిచెర్లలో 6.2, పూతలపట్టు, గుడుపల్లె మండలాల్లో 5.6, కుప్పంలో 3.4, పెనుమూరులో 2.8 మిమీ వర్షపాతం నమోదయ్యింది.



సదుం మండలం కొర్లగుంటవారిపల్లెలో వర్షంతో దెబ్బతిన్న టమోటా

వివాహిత ఆత్మహత్య



కౌసల్య మృతదేహం

నింద్ర, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నింద్ర మండలం పాదిరి దళితవాడకు చెందిన చార్లెస్‌తో నగరి దళితవాడకు చెందిన కౌసల్యకు 2021 ఫిబ్రవరి 15న ప్రేమ వివాహం జరిపించారు. కొంతకాలం వీరి కాపురం సజావుగా సాగింది. కుమారుడు రియోన్ క్రిష్టన్, కుమార్తె రియానా ఉన్నారు. ఆ తర్వాత చార్లెస్ మరో మహిళతో వివాహేతర సంబంధం కల్గి ఉన్నాడన్న అనుమానంతో దంపతుల తరచూ గొడవలు జరుగుతుండేవి. బుధవారం కూడా గొడవ జరగడంతో మనస్తాపానికి గురైన కౌసల్య ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుందని ఆమె తల్లి రీటా పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. పెళ్లి సమయంలో సుమారు 5 లక్షలు విలువ చేసే వస్తువులు, 15 సవరాల బంగారంతోపాటు నెలనెలా ఇంటిఖర్చులు కూడా తామే భరిస్తున్నట్లు తెలిపారు. తన కుమార్తె మృతికి అల్లుడు చార్లెస్, అతడి తల్లిదండ్రులు దొరైరాజు, మలర్ కారణమని వారిపై చర్యలు తీసుకుని, పిల్లలిద్దరినీ తనకు అప్పగించాలని కోరినట్లు నింద్ర ఇన్‌చార్జి ఎస్ఐ మహేష్ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి.. దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ట్రావెల్ అలవెన్స్ కోసం విద్యార్థుల వివరాల సేకరణ

గంగాధరనెల్లూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మోడల్ స్కూళ్లకు ఇటీవల కలిపిన విద్యార్థులకు ట్రావెల్ అలవెన్స్ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈనేపథ్యంలో గంగాధరనెల్లూరు మండలంలో ఎన్ని మోడల్ స్కూల్స్ ఏర్పాటు చేశారు.. ఎంతమంది విద్యార్థులను కలిపారు.. వారు ఎన్ని కిలోమీటర్ల దూరం నుంచి స్కూలుకు రావాలన్న వివరాలు సేకరించే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. విద్యార్థులు మోడల్ స్కూల్స్‌కు వెళ్లే దారిలో ఆర్టీసీ బస్సుల సౌకర్యం ఉంటే ట్రావెల్ అలవెన్స్ ఇవ్వరని విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు. ఇవన్నీ పూర్తయ్యాక ట్రావెల్ అలవెన్స్‌కు ఎంపికైన ఒక్కో విద్యార్థికి నెలకు రూ.600 లెక్కన 10 నెలల పాటు ప్రభుత్వం అందించనుంది.

అన్న క్యాంటీన్‌కు భూమి పూజ



అన్న క్యాంటీన్‌కు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల, పీఎస్ఎం తదితరులు

కుప్పం రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలం మల్లానూరులో నూతనంగా నిర్మించనున్న అన్న క్యాంటీన్ భవన నిర్మాణానికి గురువారం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, టీడీపీ రూరల్ మండలాధ్యక్షుడు ప్రేమ్ కుమార్, టీటీడీ బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మల్లానూరులో రూ.66 లక్షలతో నిర్మించనున్న అన్న క్యాంటీన్ భవనాన్ని డిసెంబరుకల్లా పూర్తి చేస్తామని చెప్పారు. అనంతరం రూ.5 లకే పేదలకు నాణ్యమైన భోజనం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

'అసలీ కోళ్ల' పంపిణీ



పెరటి కోళ్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల, పీఎస్ఎం తదితరులు

కుప్పం రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలం మల్లానూరులో గురువారం లబ్ధిదారులకు 'అసలీ కోళ్లను' (పెరటి కోళ్లు) ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ పీఎస్.మునిరత్నం, టీడీపీ మండల పార్టీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం పెరటి కోళ్ల పెంపకాన్ని ప్రోత్సహించడానికి నిర్ణయించిందన్నారు. ఇప్పటికే నియోజకవర్గ వ్యాప్తంగా 400 యూనిట్లను ఇచ్చామన్నారు. ఒక యూనిట్‌కు అంటే 8 పెట్టలు, 3 పుంజులు కలిపి రూ.3100 చెల్లించిన రైతులకు వీటిని పెంపకానికి పంపిణీ చేస్తామని చెప్పారు. ఇంకా వంద యూనిట్లకు రైతులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. కార్యక్రమంలో టీటీడీ బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, కడా సలహా మండలి సభ్యుడు రామచంద్ర, నాయకులు సాంబశివం, సంజీవి, దామోదర్, సంతోశ్, రాధాకృష్ణమూర్తి, రాజగోపాల్, మణి, మురళి, రమేశ్, విభూషణ్, శివకుమార్, కృష్ణమూర్తి, నాగార్జున లీలావెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న వాసు

రొంపిచెర్ల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో రైతులు అధిక లాభాలు పొందగలరని జిల్లా ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు మేనేజర్ వాసు అన్నారు. గురువారం ఆయన రొంపిచెర్ల ఎంపీడీవో కార్యాలయంలో రైతులకు వ్యవసాయంపై శిక్షణ అందించారు. రసాయన ఎరువులతో వ్యవసాయం కారణంగా పెట్టుబడి అధికం కావడంతో పాటు భూముల సారవంతం దెబ్బతింటుందన్నారు. వరి పండించే రైతులందరూ ఆరుతడి పంటలకు ప్రాధాన్యతనివ్వాలని తెలిపారు. రైతులు తమ భూమిలోని నీటి శాతాన్ని శాస్త్రీయంగా తెలుసుకొని వరిపొలాలకు తగిన నీటిని పెట్టుకొంటూ మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఏలు నాంచారమ్మ, ఫైజునిషా, కవిత, కోమల, రెడ్డెమ్మ, అనంతలక్ష్మి, ఓబులేష్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు బహుమతులు



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈవో శ్రీనివాసులు తదితరులు

రొంపిచెర్ల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): 2024-25 విద్యాసంవత్సరంలో రొంపిచెర్ల మండలం పెద్దమల్లెల ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు దాత నాగరాజరెడ్డి గురువారం నగదు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఎంఈవో శ్రీనివాసులు మాట్లాడుతూ ఊటుకూరివారిపల్లెకు చెందిన నాగరాజరెడ్డి ప్రస్తుతం లండన్‌లో ఉంటూ చదువుకున్న పాఠశాలను గుర్తించుకొని తండ్రి దేవులపల్లె రామచంద్రారెడ్డి జ్ఞాపకార్థం సాయం అందిస్తున్నారన్నారు. అనంతరం పదో తరగతిలో ప్రతిభ చూపిన విద్యార్థులు ధవనేశ్వర్‌కు రూ.12 వేలు, గౌతమ్‌కు రూ.9 వేలు, వినీలకు రూ.6 వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో దాత నాగరాజరెడ్డి, కుటుంబ సభ్యులు ఉమ, అన్వేష్, హెచ్ఎం రవీంద్రనాథ్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బురదమయంగా బెస్తపల్లి రహదారి

రొంపిచెర్ల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల మండలంలోని బెస్తపల్లికి వెళ్లే రహదారి వర్షానికి బురదమయంగా మారింది. దారిలో ప్రయాణించడానికి గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. మురుగు నీటి కాలువలు లేకపోవడంతో కొద్దిపాటి వర్షాలు పడినా వీధుల్లో నీటి నిల్వలు చేరుతున్నాయి. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.



బెస్తపల్లిలో బురదగా మారిన రోడ్డు

నైపుణ్యాభివృద్ధి శిక్షణతో ఉపాధి అవకాశాలు



శిక్షణ పొందిన అభ్యర్థులతో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేశులు

పలమనేరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): నైపుణ్యాభివృద్ధి సంస్థతో శిక్షణ పొందిన వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఉంటాయని పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేశులు అన్నారు. నిరుద్యోగ, యువతీ యువకులకు ఉపాధి కల్పించేందుకు పలమనేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రభుత్వం రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ నుంచి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించింది. శిక్షణ పూర్తిచేసుకున్న 28 మంది అభ్యర్థులకు గురువారం ధ్రువపత్రాలు అందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేశులు, కళాశాల స్కిల్ హబ్ ఇన్‌చార్జి కేసీహెచ్‌వీ సుబ్బయ్యనాయుడు, కళాశాల స్కిల్ హబ్ కోఆర్డినేటర్ సిసింద్రీ పాల్గొన్నారు.

పట్టుపురుగుల పెంపకంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న శాస్త్రవేత్త భరత్‌కుమార్

పలమనేరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రైతులు పట్టుపురుగుల పెంపకంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలని సెంట్రల్ సిరికల్చర్ బోర్డు శాస్త్రవేత్త భరత్‌కుమార్ అన్నారు. గురువారం పలమనేరు మండలం పెంగరగుంట గ్రామంలో పట్టు రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టుపరిశ్రమలో రోజురోజుకు పెరుగుతున్న కూలీల వ్యయాన్ని తగ్గించుకోవాలని.. నాణ్యమైన పట్టు గూళ్ల దిగుబడికి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకోవాలన్నారు. రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. కార్యక్రమంలో జాయింట్ డైరెక్టర్ డి.పద్మమ్మ, ఏడీ సరోజ, పట్టురైతులు పాల్గొన్నారు.

ఎస్‌బీఐ ట్రిబ్యూట్ పథకంపై అవగాహన



నల్లారెడ్డి, చంద్రమ్మ దంపతులకు సన్మానం

పలమనేరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పెన్షనర్లకు ఎస్‌బీఐ అమలు చేయనున్న ట్రిబ్యూట్ పథకంపై పెన్షనర్ల సంఘ అధ్యక్షులు రత్నారెడ్డి తెలియజేశారు. గురువారం పలమనేరు పెన్షనర్ల సంఘ భవనంలో సమావేశమయ్యారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ పదేళ్లగా ఎస్‌బీఐ ద్వారా పెన్షన్ తీసుకుంటున్న ప్రభుత్వ ఉద్యోగులు మరణిస్తే వారి దహనక్రియలకు బ్యాంకు రూ. 30 వేలు చెల్లిస్తుందన్నారు. పెన్షనర్ చనిపోయిన 72 గంటల లోపు ఈ ఆర్థికసాయం అందజేస్తారని తెలిపారు. ఇందుకోసం మరణించిన వ్యక్తికి సంబంధించిన వారిని గుర్తించేందుకు వారి ఆధార్‌కార్డు, పీపీవో, పాన్‌కార్డు సమర్పించాలన్నారు. ఈ పథకాన్ని ఎస్‌బీఐ గత నెల 23 నుంచి అమలు చేస్తున్నట్లు వివరించారు. సమావేశంలో సంఘ గౌరవాధ్యక్షులు నల్లారెడ్డి, చంద్రమ్మ దంపతులను సన్మానించారు. సంఘ సభ్యులు పాల్గొన్నారు.

బిడ్డ రోగనిరోధక శక్తికి తల్లిపాలే శ్రేష్ఠం



బాలింతను సన్మానిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మాధవీలత

పలమనేరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): బిడ్డకు రోగనిరోధక శక్తి కోసం తల్లిపాలే శ్రేష్ఠమని, పుట్టిన బిడ్డకు వెంటనే తల్లిపాలు తాగించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ మాధవీలత సూచించారు. గురువారం కొలమాసనపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు జరిగాయి. తల్లిపాల ప్రాముఖ్యత గురించి తల్లులకు వివరించారు. ఈ సందర్భంగా ఓ బాలింతను సన్మానించారు. అంగన్‌వాడీలు భారతమ్మ, వాణి, ప్రేమావతి, గంగమ్మ, సరస్వతి, రత్నమ్మ, శాంతమ్మ, నాగరత్నమ్మ పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవరాయల జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి



మాట్లాడుతున్న బలిజ సంఘ నాయకులు

పుంగనూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయల జయంతిని ప్రభుత్వ సెలవు దినంగా ప్రకటించాలని పుంగనూరు బలిజ సంఘ నాయకులు డిమాండు చేశారు. గురువారం శ్రీకృష్ణదేవరాయల 516వ పట్టాభిషేక మహోత్సవం సందర్భంగా పుంగనూరు సమీపంలోని భీమగానిపల్లె క్రాస్ వద్ద ప్రతిష్ఠించిన ఆయన కాంస్య విగ్రహానికి బలిజ సంఘ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సంఘ నాయకులు జనార్దన్ రాయల్ మాట్లాడుతూ రాయలసీమకు రత్నాల సీమగా పేరుప్రతిష్ఠలు తీసుకొచ్చిన ఘనత శ్రీకృష్ణదేవరాయలకే దక్కుతుందని, దేశభాషలందు తెలుగులెస్స అని ప్రపంచానికి చాటిచెప్పారని కొనియాడారు. బలిజ సంఘ నాయకులు ముత్యాలు, రాఘవ రాయల్, నానబాల చిన్నమణి, నానబాల గణేశ్, వెంకటరమణ రాయల్, గోపి, పరమేశ్, రామకృష్ణ, రమేశ్ పాల్గొన్నారు.

మంత్రి మనోహర్‌ను కలిసిన పుంగనూరు జనసేన నేతలు



పుంగనూరు, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్‌ను పుంగనూరు జనసేన నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. గురువారం అమరావతి సచివాలయంలో జనసేన ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర హస్తకళ కార్పోరేషన్ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్‌తో కలిసి పుంగనూరు నియోజకవర్గ పరిస్థితులు, జిల్లాలో నామినేటెడ్ పదవుల కేటాయింపులపై తెలియజేసినట్లు పుంగనూరు జనసేన నాయకుడు చిన్నరాయల్ తెలిపారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన ఉపాధ్యక్షుడు మధుబాబు, దినేష్, సాయినాథ్, పార్థు, వెంకట్, భారత్ పాల్గొన్నారు.

నేడు వెంకటేశ్వరస్వామి ఆలయంలో వరలక్ష్మీ వ్రతం

సోమల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆవులపల్లె వెంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం టీటీడీ ఆధ్వర్యంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా వరలక్ష్మీ వ్రతం నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు, దేవస్థాన అధికారులు తెలిపారు. ఆలయంలో ఉదయం సామూహిక వరలక్ష్మీ వ్రతం, లక్ష్మీ సహస్రనామ కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులకు టీటీడీ వారిచే అమ్మవారి కుంకుమ, గాజులు, పసుపు దారం, కంకణాలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. అలాగే శనివారం పౌర్ణమిని పురస్కరించుకొని శ్రీవారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

శుభ్రపడుతున్న మురుగు కాలువలు



హెచ్‌పీ రోడ్డులో మురుగు కాలువలో తీస్తున్న పూడిక

కుప్పం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కుప్పం పురపాలక సంఘం పరిధిలో మురుగు కాలువలు శుభ్రపడుతున్నాయి. మురుగునీరు ప్రవహించే పట్టణంలోని ప్రధాన కాలువల్లో ఏళ్లతరబడి పూడిక తీయకపోవడంతో ఎక్కడికక్కడ పూడిక పేరుకుపోయింది. వానలు వచ్చినప్పుడు ఈ మురుగునీరు రోడ్లపై ప్రవహించేది. లేనప్పుడు ఎక్కడి మురుగక్కడ నిలిచిపోయి నివాసాలలో పారిశుధ్యం పరిస్థితి ఘోరంగా తయారయ్యేది, మరుగుదొడ్లు, స్నానశాలల్లో నీళ్లు నిలిచిపోయి నివాసం దుర్భరంగా మారేది. ఇటువంటి పరిస్థితుల్లో మున్సిపల్ కమిషనర్ వి.శ్రీనివాసరావు మురుగు కాలువలను శుభ్రం చేయాలని సంకల్పించారు. నేతాజీ రోడ్డు, ఎన్టీఆర్ కాలనీ, హెచ్‌పీ రోడ్డు తదితర ప్రాంతాల్లోని ప్రధాన మురుగు కాలువల్లోని పూడికను పొక్లయినర్లతో వెలికి తీయిస్తున్నారు. కుప్పం పట్టణంలోని హెచ్‌పీ రోడ్డులో గురువారం ఉదయం నుంచి ప్రధాన మురుగు కాలువలో పూడికతీత పనులు ప్రారంభమయ్యాయి. నేతాజీ రోడ్డు నుంచి హెచ్‌పీ రోడ్డును దాటి ఫైబాట మీదుగా ఈ కాలువ సాగుతుంది. దారి పొడవునా పదుల సంఖ్యలో ఇళ్లున్నాయి. ఈ ఇళ్లలోని మురుగునీరు మొత్తం ఇదే కాలువలోకి వదులుతారు. అయితే పూడిక తీసే పనులు ఏళ్లతరబడి జరగకపోవడంతో కాలువలో మురుగు గడ్డకట్టి, ఇళ్లలోని వాడిన అపరిశుభ్రమైన నీళ్లు, ఇతర వ్యర్థ పదార్థాలు బయటకు వచ్చేందుకు వీలు లేక ప్రజలు నానారకాల ఇబ్బందులు పడేవారు. అయితే గురువారం ఈ ప్రధాన కాలువను పొక్లయినర్‌తో శుభ్రం చేయించి పూడిక తీసివేయడంతో మురుగు సాఫీగా సాగింది. ఇళ్లలోని అపరిశుభ్రమైన వ్యర్థ నీళ్లు, పదార్థాలు సాఫీగా వెళ్లిపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. నిలిచిపోయిన మురుగు వల్ల ఇన్నాళ్లూ దోమలు, వ్యాధుల బారిన పడి ఆర్థికంగా, ఆరోగ్యపరంగా కష్టాలు పడిన స్థానికులు మున్సిపల్ అధికారులకు ధన్యవాదాలు తెలిపారు.

స్వయం ఉపాధి కేంద్రాల అభివృద్ధికి చర్యలు

చౌడేపల్లె, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధి కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చిత్తూరు, విజయనగరం జిల్లాల డీఆర్‌డీఏ పీడీలు శ్రీదేవి, శ్రీనివాసులు పేర్కొన్నారు. గురువారం మండలంలో డ్వాక్రా సంఘాల నుంచి రుణాలు తీసుకుని జీవనోపాధి పొందుతూ ఇతరులకు ఉపాధి కల్పిస్తున్న వ్యాపారాలపై అధ్యయనం చేశారు. మండలంలోని చారాలలో పంచలోహ విగ్రహాల తయారీ, పక్షిరాజపురంలో ప్లాస్టిక్ పూల తయారీ, కాన్‌సాబ్‌మిట్టలో బిస్కెట్ల తయారీ కేంద్రాలను పరిశీలించారు. ప్రతిఒక్కరూ స్వయం ఉపాధి పొందుతూ ఆర్థికంగా ఎదగాలని సూచించారు. అనంతరం బోయకొండ గంగమ్మను, మృత్యుంజయేశ్వరస్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. కార్యక్రమంలో సీసీలు, సంఘ మిత్రలు పాల్గొన్నారు.



ప్లాస్టిక్ పూల తయారీని పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీలు

సదుంలో భారీ వర్షం

సదుం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలో బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం ఉదయం 7 గంటల వరకు భారీ వర్షం కురిసింది. ఉరుములు, మెరుపులు, ఈదురు గాలులు లేకుండా నిలకడగా కురిసిన వర్షంతో పలు రకాల పంటలకు నష్టం వాటిల్లింది. మూడు గంటల వ్యవధిలో 37.4 మి.మీల వర్షపాతం నమోదైనట్లు రెవెన్యూ సిబ్బంది తెలిపారు.

గడ్డూరులో క్వారీ పరిశీలన



గడ్డూరులో క్వారీని పరిశీలిస్తున్న ఆర్డీవో భవాని, అధికారులు

బైరెడ్డిపల్లె, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గడ్డూరు సమీపంలోని క్వారీని గురువారం పలమనేరు ఆర్డీవో భవాని, రెవెన్యూ అధికారులతో కలిసి పరిశీలించారు. గత కొంతకాలంగా క్వారీ కారణంగా సమస్యలు ఎదుర్కొంటున్నామని గ్రామస్తులు ఇటీవల అధికారులకు ఫిర్యాదు చేయడం, నిరసనలు చేపట్టడంతో స్పందించిన ఆర్డీవో క్వారీని సందర్శించి వివరాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మళ్లీ సమస్యలను ఆర్డీవో దృష్టికి తీసుకొచ్చారు. క్వారీ నిర్వహించడానికి అనుమతులు ఉండటంతో నిబంధనల మేరకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని అధికారులు గ్రామస్తులకు తెలిపారు. కార్యక్రమంలో ఏఈ మదన్‌మోహన్, సీఐ మురళీమోహన్, బైరెడ్డిపల్లె తహసీల్దార్ ప్రసన్నకుమార్, ఎస్ఐ పరశురాముడు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్‌సీసీలో 'శుభారాం' విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులకు ఎన్‌సీసీ సర్టిఫికెట్లను అందజేసిన ప్రిన్సిపాల్ శ్రీనివాస్

పుంగనూరు రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ఎన్‌సీసీలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పుంగనూరు శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ గురువారం సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల ఎన్‌సీసీ కార్యక్రమంలో కళాశాల నుంచి 25 మంది విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచి సీ, బీ సర్టిఫికెట్లు సాధించినట్లు ఆయన తెలిపారు. ఎన్‌సీసీ సర్టిఫికెట్లు పొందిన వారికి పోటీ పరీక్షల్లో 15 శాతం రిజర్వేషన్ ఉంటుందన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు ఎన్‌సీసీ విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ అధికారి సోమరాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బలిజపల్లెలో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించిన ఎస్ఈ ఇస్మాయిల్ తదితరులు

సదుం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బలిజపల్లె ఫైవ్ ఎంవీఏ కెపాసిటీ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను చిత్తూరు జిల్లా ఎస్ఈ ఇస్మాయిల్ గురువారం ప్రారంభించారు. అధిక లోడు నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం రూ.1.50 కోట్ల వ్యయంతో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో డీఈలు శ్రీనివాస్, మూర్తి, బాబు, నరేంద్ర, ఏఈలు చంద్రశేఖర్, హేమచంద్ర, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం మత్తులో యువకుల వీరంగం

సోమల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): సోమల యూనియన్ బ్యాంకు వద్ద ముగ్గురు యువకులు మద్యం మత్తులో వీరంగం చేయడంతో సోమల పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని దేహశుద్ధి చేశారు. గురువారం సాయంత్రం చౌడేపల్లె మండలం సింగిరికుంటకు చెందిన ముగ్గురు యువకులు మద్యం తాగి యూనియన్ బ్యాంకు ఏటీఎం వద్దకు వచ్చారు. ఏటీఎం పనిచేయడం లేదని.. ఏటీఎంను మూసి వేయాలని బ్యాంకు ఉద్యోగులతో గొడవకు దిగారు. బ్యాంకు ఉద్యోగులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ శివశంకర సిబ్బందితో కలిసి బ్యాంకు వద్ద మద్యం మత్తులో ఉన్న ముగ్గురు యువకులకు దేహశుద్ధి చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు.

కారు ఢీకొని యువకుడికి గాయాలు



గాయపడిన వినాయక

గంగవరం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పలమనేరు-బెంగళూరు రహదారిలో వైఎస్సార్ సర్కిల్ వద్ద ఓ కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొనడంతో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. పలమనేరు మండలం జల్లిపేట గ్రామానికి చెందిన వినాయక (18) స్నేహితులతో కలిసి ద్విచక్రవాహనంపై దండపల్లె రోడ్డుకు వెళ్లారు. దండపల్లె రోడ్డులో వైఎస్సార్ సర్కిల్ వద్ద రోడ్డు దాటుతుండగా.. బెంగళూరు వైపు వెళ్తున్న కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ప్రమాదంలో ద్విచక్రవాహనం వెనుక కూర్చొని ఉన్న వినాయక తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గుర్తించి చికిత్స నిమిత్తం పలమనేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు గంగవరం అర్బన్ సీఐ ప్రసాద్ తెలిపారు.

ప్రభుత్వాస్పత్రిలో ఎల్ఈడీ టీవీ చోరీ

పుంగనూరు రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలోని చిన్నపిల్లల వార్డులో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ టీవీ బుధవారం రాత్రి చోరీకి గురైంది. గురువారం ఉదయం ఆస్పత్రి సిబ్బంది విధులకు హాజరుకావడంతో టీవీ కనిపించకపోవడం గమనించి విషయాన్ని మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హరిగోపాల్‌కు ఫిర్యాదు చేశారు. ఆయన వెంటనే సీసీ కెమెరాలను పరిశీలించగా ఆస్పత్రిలో పని చేసే ఓ కాంట్రాక్ట్ ఉద్యోగి తీసుకెళ్లినట్లు గుర్తించారు. వెంటనే అతడిని పిలిపించి మందలించడంతో ఆ ఉద్యోగి వెంటనే టీవీని తిరిగి తీసుకొచ్చి వార్డులో ఉంచాడు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

పుంగనూరు రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సభ్యులు మందలించారని ఓ యువకుడు మనస్తాపంతో పశువులకు వాడే పిడుదల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గురువారం పుంగనూరు మండలంలో జరిగింది. బాధితుల కథనం మేరకు.. మండలంలోని బసినేపల్లెకు చెందిన సుందరం కుమారుడు హేమంత్(22)ను తల్లిదండ్రులు పనులు చేయలేదని మందలించడంతో మనస్తాపానికి గురై ఇంట్లో పశువుల కోసం తెచ్చిన పిడుదల మందును తాగాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం పుంగనూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించగా అతని పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్ల సూచనల మేరకు మదనపల్లె ఆస్పత్రికి తరలించారు.

'ఉల్లాస్'పై మహిళా వలంటీర్లకు శిక్షణ

రొంపిచెర్ల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రొంపిచెర్ల స్త్రీశక్తి భవనంలో గురువారం సంపూర్ణ అక్షరాస్యత సాధించేందుకు 'ఉల్లాస్' రెండో విడత కార్యక్రమంపై మహిళా వలంటీర్లకు ఏపీఎం హరినాథ్ శిక్షణ ఇచ్చారు. మండలంలో 2030 మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందినట్లు చెప్పారు. సీసీ రమేష్, సంఘమిత్రలు, వలంటీర్లు పాల్గొన్నారు.

సర్వీసు రోడ్లు జలమయం..!

గంగవరం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): గంగవరం మండల పరిధి పలమనేరు- బెంగళూరు రహదారిలోని పలు సర్వీసు రోడ్లపై వర్షపునీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. గత రెండు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు మండలంలోని దండపల్లె రోడ్డులోని వైఎస్సార్ సర్కిల్, చిన్నూరు వద్ద ఉన్న సర్వీసు రోడ్లు వర్షపు నీటితో నిండిపోయాయి. ముఖ్యంగా హైవే రోడ్డు నిర్మాణంలో ముందస్తు జాగ్రత్తలు చూసుకోకుండా హైవే రోడ్డుకు కాస్త తగ్గులో సర్వీసు రోడ్లను నిర్మించారు. అయితే హైవే రోడ్డు పైన ఉండటం, సర్వీసు రోడ్డు తగ్గులో ఉండటంతో వర్షపు నీరు మొత్తం సర్వీసు రోడ్లపైకి వచ్చేస్తోంది. దీనికితోడు సర్వీసు రోడ్ల నుంచి వర్షపు నీరు వెళ్లడానికి సరైన డ్రైనేజీ పైపులైన్ ఏర్పాటు చేయకపోవడంతో వర్షపు నీరు ఎక్కడికక్కడ స్తంభించిపోతోంది. ఇలా వర్షపు నీరు స్తంభించిపోవడంతో అటు వైపుగా వెళ్లే వాహనదారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వర్షపునీటి నిల్వలను తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా సహకరించాలని ఆ ప్రాంత వ్యాపారులు, వాహనదారులు కోరుతున్నారు.



దండపల్లి జంక్షన్ వద్ద రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి: డీఎస్పీ



సమావేశంలో ప్రసంగిస్తున్న డీఎస్పీ అజీజ్

శ్రీరంగరాజపురం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని నగరి డీఎస్పీ అజీజ్ సూచించారు. గురువారం రాత్రి 49.కొత్తపల్లెమిట్టలో 'పోలీసుల పల్లెనిద్ర' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక జడ్పీ పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రామస్తులతో నిర్వహించిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, వన్యప్రాణులను వేటాడినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సైబర్ నేరాలు, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. అనంతరం కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన పెనుమూరు మండలానికి చెందిన అక్కాతమ్ముడు కోలాల రేవతి, తిరుమలయ్యను డీఎస్పీ సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సుమన్, సిబ్బంది పాల్గొన్నారు.

కూటమితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం: టీడీపీ



ముంగరమడుగులో కరపత్రాలను పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

బంగారుపాళ్యం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ముంగరమడుగు టీడీపీ గ్రామాధ్యక్షురాలు సమారియా అన్నారు. ఏడాది ప్రభుత్వ పాలనపై గురువారం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందజేశారు. సింగిల్‌విండో మాజీడైరెక్టర్ చిట్టెమ్మ, బూత్‌కన్వీనర్ సతీష్, మాజీ సర్పంచ్ మణి, చిన్న దొరై, అనురాజ్, హరీష్, ధనంజయ, అనుసత్య, ఆరంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

దళిత యువకుడిపై భూమన అనుచరుల దాడి అమానుషం: టీడీపీ



మీడియాతో మాట్లాడుతున్న సురేంద్రకుమార్

చిత్తూరు సిటీ, ఆగస్టు7 (ఆంధ్రజ్యోతి): దళిత యువకుడిపై మాజీ ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి, ఆయన కుమారుడు అభినయ్ అనుచరుల దాడి అమానుషమని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్ అన్నారు. గురువారం జిల్లా పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. వైసీపీ దళిత వ్యతిరేక పార్టీ మండిపడ్డారు. కూటమి ప్రభుత్వంలో భూమన వంటివారి రౌడీయిజం, దౌర్జన్యం, అక్రమాలు చెల్లవని స్పష్టం చేశారు. సమావేశంలో నేతలు మోహన్‌రాజ్, ధరణి, తదితరులు పాల్గొన్నారు.

'నూతన ఉభయదారుల చేరికలో ఎమ్మెల్యే ప్రమేయం లేదు'

చిత్తూరు సిటీ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): నూతన ఉభయదారుల చేరికలో పూతలపట్టు ఎమ్మెల్యే మురళీ మోహన్ ప్రమేయం లేదని కాణిపాక శ్రీవరసిద్ధి వినాయక స్వామి బ్రహ్మోత్సవాల చంద్రప్రభ వాహన సేవకు సంబంధించిన 14 గ్రామాల ఉభయదారులు స్పష్టం చేశారు. గురువారం చిత్తూరు ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. బుధవారం.. విజయన్, మూర్తి, త్రినాథ్, గిరి అనే వ్యక్తులు ఎమ్మెల్యేపై చేసిన ఆరోపణలు అవాస్తవమని చెప్పారు. చంద్రప్రభ వాహన సేవ ఉభయదారులుగా కొత్తగా కె.పట్నం, పైపల్లె, సిద్దంపల్లె గ్రామాలను కలిపేందుకు 14 గ్రామాల ఉభయదారులే నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఉభయదారులు కేశవులు, రాజ్‌కుమార్, బాబు, నటరాజు, చిరంజీవి, పరదేశి తదితరులు పాల్గొన్నారు.

ఇస్రో క్విజ్ పోటీల్లో 'పీఈఎస్' విద్యార్థుల ప్రతిభ



ప్రశంసా పత్రాలతో పీఈఎస్ స్కూల్ విద్యార్థులు

యాదమరి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరంలోని సీటమ్స్ కళాశాలలో జరిగిన ఇస్రో జిల్లాస్థాయి క్విజ్ పోటీల్లో పీఈఎస్ స్కూల్ విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించారని ప్రిన్సిపాల్ కృష్ణబాబు తెలిపారు. రెండ్రోజులుగా జరుగుతున్న నేషనల్ స్పేస్ డే టాలెంట్ పోటీల్లో జిల్లాలోని 12 పాఠశాలలు పాల్గొనగా, పీఈఎస్ విద్యార్థులు భవజ్ఞ సాయి, యజ్ఞ, మోనికా, వైదీశ్, ప్రకాశ్ ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నారని చెప్పారు. వీరిని గురువారం ప్రిన్సిపాల్, టీచర్లు అభినందించారు.

స్పీడ్ బ్రేకర్ల వద్ద సూచికలెక్కడ?





యాదమరి ఐఓసీఎల్, మార్లబండ స్పీడ్ బ్రేకర్ల వద్ద ఏర్పాటు చేయని సూచికలు

యాదమరి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అంతర్రాష్ట్ర రహదారిలోని స్పీడ్ బ్రేకర్లు ప్రమాదాలకు నెలవుగా మారుతున్నాయని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఐఓసీఎల్ ప్రాంతంలో, మార్లబండ గ్రామ సమీపంలో ఉన్న స్పీడ్ బ్రేకర్ల వద్ద వేగనిరోధక సూచికలు ఏర్పాటు చేయకపోవడంతో పలువురు వాహనదారులు ప్రమాదాల బారినపడి ఆస్పత్రుల పాలవుతున్నారు. ఇటీవల తమిళనాడు రాష్ట్రం పరదరామికి చెందిన ఒక జంట మార్లబండ స్పీడ్‌బ్రేకర్‌ను గమనించక కిందపడడంతో మహిళకు తీవ్రగాయాలయ్యాయి. ఇకనైనా స్పీడ్‌బ్రేకర్ల వద్ద సూచికలు, పెయింటింగ్ వంటి ఏర్పాట్లు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

స్వయం ఉపాధి కేంద్రాల అభివృద్ధికి చర్యలు

- చిత్తూరు, విజయనగరం జిల్లాల డీఆర్‌డీఏ పీడీలు

చౌడేపల్లె, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): స్వయం ఉపాధి కేంద్రాల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చిత్తూరు, విజయనగరం జిల్లాల డీఆర్‌డీఏ పీడీలు శ్రీదేవి, శ్రీనివాసులు తెలిపారు. గురువారం చౌడేపల్లె మండలంలో డ్వాక్రా సంఘాల నుంచి రుణాలు తీసుకుని జీవనోపాధి పొందుతూ ఇతరులకు ఉపాధి కల్పిస్తున్న వ్యాపారాలపై అధ్యయనం చేశారు. చారాలలో పంచలోహ విగ్రహాల తయారీ, పక్షిరాజపురంలో ప్లాస్టిక్ పూల తయారీ, కాన్‌సాబ్‌మిట్టలో బిస్కెట్ల తయారీ కేంద్రాలను పరిశీలించారు. ప్రతిఒక్కరూ స్వయం ఉపాధి పొందుతూ ఆర్థికంగా ఎదగాలని సూచించారు. అనంతరం బోయకొండ గంగమ్మను, మృత్యుంజయేశ్వరస్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు. సీసీలు, సంఘ మిత్రలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక లాభాలు

రొంపిచెర్ల, ఆగస్టు 7(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో రైతులు అధిక లాభాలు పొందగలరని జిల్లా ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు మేనేజర్ వాసు అన్నారు. గురువారం ఆయన రొంపిచెర్ల ఎంపీడీవో కార్యాలయంలో రైతులకు వ్యవసాయంపై శిక్షణ అందించారు. రసాయన ఎరువులతో వ్యవసాయం కారణంగా పెట్టుబడి అధికం కావడంతో పాటు భూముల సారవంతం దెబ్బతింటుందన్నారు. రైతులు తమ భూమిలోని నీటి శాతాన్ని శాస్త్రీయంగా తెలుసుకొని వరిపొలాలకు తగిన నీటిని పెట్టుకొంటూ మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఏలు నాంచారమ్మ, ఫైజునిషా, కవిత, కోమల, రెడ్డెమ్మ, అనంతలక్ష్మి, ఓబులేష్ తదితర సిబ్బంది పాల్గొన్నారు.

వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలి: ఈఈ

చిత్తూరు రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం మొదలైందని, అప్రమత్తంగా ఉండాలని విద్యుత్‌శాఖ సిబ్బందిని చిత్తూరు ఆపరేషన్ డివిజన్ ఈఈ మునిచంద్ర ఆదేశించారు. గురువారం గాంధీరోడ్డులోని విద్యుత్ శాఖ కార్యాలయంలో డివిజన్ స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. విద్యుత్ పరికరాలను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఏఈలు పెండింగ్ వర్క్ ఆర్డర్లను పూర్తి చేయాలని చెప్పారు. పీఎం సూర్యఘర్ పథకంపై విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా 300 యూనిట్లపైగా వాడుతున్న వినియోగదారులను ప్రత్యేకంగా అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో డీఈ ఆనంద్, ఏఈలు పాల్గొన్నారు.

11న 'ప్రజావేదిక': ఎంపీడీవో

నగరి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): నగరి మండలంలోని 21 పంచాయతీల్లో 2024-25 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనుల సామాజిక తనిఖీకి సంబంధించిన ప్రజావేదిక ఈనెల 11వ తేదీన ఎంపీడీవో కార్యాలయ ఆవరణంలో జరగనుంది. ఈ మేరకు ఎంపీడీవో కృష్ణయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

కాలువ కాదు రోడ్డే..!



జిల్లా అగ్నిమాపక శాఖ కార్యాలయం ముందు నిలిచిన వర్షపు నీరు

చిత్తూరు సిటీ, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా అగ్నిమాపక కేంద్రం ఎదురుగా ఉన్న రోడ్డు కాలువను తలపిస్తోంది. చిన్నపాటి వర్షం కురిసినా కాలువలు సరిగా లేకపోవడంతో నీరంతా రోడ్డుపై నిలిచిపోతోంది. బుధవారం రాత్రి కురిసిన వానకు రోడ్డుపై ఇలా నీరు నిలిచింది. అగ్నిమాపక సిబ్బందితోపాటు ఈ మార్గంలో వెళ్లే జనం తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఇకనైనా ఈ సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.

మెరుగైన డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు చర్యలు: మేయర్



ఎంఎస్ఆర్ సర్కిల్ వద్ద మేజర్ కాలువను పరిశీలిస్తున్న మేయర్ అముద, కమిషనర్ నరసింహ ప్రసాద్ తదితరులు

చిత్తూరు అర్బన్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): నగరంలో మెరుగైన డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని అధికారులను మేయర్ అముద ఆదేశించారు. కమిషనర్ నరసింహ ప్రసాద్, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి ఎంఎస్ఆర్ సర్కిల్, పలమనేరు రోడ్డు, పాత బస్టాండ్ ప్రాంతాల్లోని మెయిన్ డ్రెయిన్లను గురువారం పరిశీలించారు. ప్రధానంగా వర్షాలు కురిసినప్పుడు ఎగువ ప్రాంతాల నుంచి ఎంఎస్ఆర్ సర్కిల్ వద్ద ఉన్న కల్వర్టుకు ఎక్కువగా నీరు రావడంతో రోడ్డుపైకి ప్రవహిస్తోంది. ఈ ప్రవాహాన్ని తగ్గించడానికి ప్రత్యామ్నాయ చర్యలపై చర్చించారు. దర్గాసర్కిల్ నుంచి వర్షపు నీరు ఇక్కడికి రాకుండా మళ్లించడానికి వీలుగా మరో కల్వర్టును నిర్మించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అలాగే నగరంలో పలు ప్రాంతాల్లో వర్షపు నీరు నిల్వ లేకుండా చేయడంపై దృష్టి పెట్టాలన్నారు.

కమిషనర్ విస్తృత తనిఖీలు: నగరంలో కమిషనర్ నరసింహ ప్రసాద్ గురువారం తెల్లవారుజామున విస్తృతంగా పర్యటించారు. వర్షపు నీరు నిల్వ చేరిన కాలనీలు, కాలువలను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడారు. వర్షపు నీరు వెళ్లడానికి రెండు ప్రాంతాల్లో కల్వర్టుల నిర్మాణం చేయాలని డీఈ రమణను ఆదేశించారు.

చేనేతల జీవితాల్లో వెలుగులు తెచ్చిన చంద్రన్న

కార్మికులకు తీపిగుర్తుగా ఉచిత విద్యుత్ పథకం : ఎమ్మెల్యే భానుప్రకాష్



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే భానుప్రకాష్

నగరి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మరమగ్గ కార్మికులకు మరపురాని తీపి గుర్తుగా ఉచిత విద్యుత్ పథకం నిలిచిపోతుందని నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్ అన్నారు. నగరి పట్టణంలోని సత్రవాడలో గురువారం మరమగ్గ, చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల ముందు ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న మన చంద్రన్న.. చేనేతల జీవితాల్లో వెలుగులు తెచ్చారని, వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. దశాబ్దాల కాలంగా ఉచిత విద్యుత్ కోసం పోరాడి అలసిన నేతన్నలకు కూటమి ప్రభుత్వం ఊరటనిచ్చిందన్నారు. ఆగస్టు నుంచి మరమగ్గాలకు 500 యూనిట్లు, చేనేత రంగం వారికి 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను ఇవ్వనుందని ఎమ్మెల్యే వివరించారు. నగరి మున్సిపాలిటీ, మండల పరిధిలో 3,418 మరమగ్గాలుంటే, పుత్తూరులో 808 మరమగ్గాలు నడుస్తున్నాయన్నారు. ఈ లెక్కన నగరి నియోజకవర్గంలోనే 4,226 మంది మరమగ్గ కార్మికులకు ఉచిత విద్యుత్ సౌకర్యాన్ని కూటమి ప్రభుత్వం కల్పించనుందన్నారు. అనంతరం పురవీధులలో ఊరేగింపుగా వెళ్లి మరమగ్గాలలో నేతన్న నేస్తున్న వస్త్రాన్ని పరిశీలించారు. నగరి పట్టణ టీడీపీ అధ్యక్షుడు రమేష్, కార్యదర్శి శ్రీనివాసన్, టీఎన్‌టీయూసీ రాష్ట్ర కార్యదర్శి బాలాజి, పుత్తూరు మాజీ ఎంపీపీ గంజి మాధవయ్య, నాయకులు మాణిక్యవాసన్, కరుణ, మరివాసన్, కృష్ణారెడ్డి, గుణశేఖర్ టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వర్షానికి కూలిన పాఠశాల ప్రహరీ

- నాసిరకం పనులే కారణమని గ్రామస్తుల ఆరోపణ



కూలిన ప్రహరీని పరిశీలిస్తున్న గ్రామస్తులు

పాలసముద్రం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): టీవీఎన్‌ఆర్‌పురం ప్రాథమిక పాఠశాల ప్రహరీ బుధవారం రాత్రి కురిసిన వర్షానికి కూలిపోయింది. రెండేళ్ల కిందట నాడు-నేడు పథకం కింద ఈ ప్రహరీ నిర్మించారు. అప్పట్లో ఈ పనులను నాసిరకంగా చేశారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అందువల్లే ఇలా కూలిపోయిందని చెబుతున్నారు. ఈ పనులపై ఉన్నతాధికారులు విచారించి తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. రాత్రిపూట కూలడం వల్ల పెద్ద ప్రమాదం తప్పిందని విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



పాతార్కాడులో కరపత్రాలు పంచుతున్న టీడీపీ నాయకులు

విజయపురం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని టీడీపీ నాయకులు తెలిపారు. పాతార్కాడులో 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమంలో భాగంగా గురువారం ఇంటింటికీ వెళ్లి కరపత్రాలను అందజేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు రమేష్‌రాజు, నాయకులు హరికృష్ణ, బాలసుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంటును ప్రారంభించిన ఎమ్మెల్యే

విజయపురం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మల్లారెడ్డి కండ్రిగలో వాటర్‌ప్లాంటును గురువారం ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ప్రారంభించారు. ఎప్పటికప్పుడు ప్రజల సమస్యలను పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ కిరణ్, ఎంపీడీవో రాజేంద్ర, చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధికార ప్రతినిధి చినబాబు, కార్యనిర్వాహక కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యంరాజు, మండల అధ్యక్షుడు రమేష్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, నాయకులు సమరసింహారెడ్డి, దశరథరాజు, కాశిరెడ్డి, నాదముని, నాగరాజు, కపిల్, జనసేన నేత మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మల్లానూరులో అన్న క్యాంటీన్‌కు భూమి పూజ

కుప్పం రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కుప్పం మండలం మల్లానూరులో నూతనంగా నిర్మించనున్న అన్న క్యాంటీన్ భవన నిర్మాణానికి గురువారం ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పీఎస్.మునిరత్నం, టీడీపీ రూరల్ మండలాధ్యక్షుడు ప్రేమ్ కుమార్, టీటీడీ బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మల్లానూరులో రూ.66 లక్షలతో నిర్మించనున్న అన్న క్యాంటీన్ భవనాన్ని డిసెంబరుకల్లా పూర్తి చేస్తామని చెప్పారు. అనంతరం రూ.5 లకే పేదలకు నాణ్యమైన భోజనం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

పనిచేయని ఫోన్లు మాకొద్దు



ఫోన్లను అట్టపెట్టెలో వేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

నగరి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పనిచేయని ఫోన్లు తమకొద్దంటూ వాటిని ఓ అట్టపెట్టెలో పెట్టి నగరి సీడీపీవో కార్యాలయ సిబ్బందికి అంగన్‌వాడీ కార్యకర్తలు గురువారం అప్పగించారు. సీఐటీయూ నాయకురాలు ధనకోటి ఆధ్వర్యంలో నగరి మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలు తమ ఫోన్లను ఇచ్చేశారు. రోజుకో యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని వేధించడం సరికాదని అంగన్‌వాడీలు ఆవేదన వ్యక్తం చేశారు.

చెత్త సేకరణ కేంద్రం నిర్వహణ ఇలాగేనా?



తొట్టెల నిండా మొలిచిన మొక్కలు

వెదురుకుప్పం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలంలోని కొటార్వేడు గ్రామ సచివాలయం దగ్గరలో నిర్మించిన చెత్త సేకరణ కేంద్రం నిర్వహణ అస్తవ్యస్తంగా తయారైంది. చెత్తను వేసే తొట్టెల నిండా వివిధ రకాల మొక్కలు మొలిచి ఉన్నాయంటేనే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు పట్టించుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మద్యం మత్తులో యువకుల వీరంగం

సోమల, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): సోమల యూనియన్ బ్యాంకు వద్ద ముగ్గురు యువకులు మద్యం మత్తులో వీరంగం చేయడంతో సోమల పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని దేహశుద్ధి చేశారు. గురువారం సాయంత్రం చౌడేపల్లె మండలం సింగిరికుంటకు చెందిన ముగ్గురు యువకులు మద్యం తాగి యూనియన్ బ్యాంకు ఏటీఎం వద్దకు వచ్చారు. ఏటీఎం పనిచేయడం లేదని.. ఏటీఎంను మూసి వేయాలని బ్యాంకు ఉద్యోగులతో గొడవకు దిగారు. బ్యాంకు ఉద్యోగులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ శివశంకర సిబ్బందితో కలిసి బ్యాంకు వద్ద మద్యం మత్తులో ఉన్న ముగ్గురు యువకులకు దేహశుద్ధి చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

పుంగనూరు రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కుటుంబ సభ్యులు మందలించారని ఓ యువకుడు మనస్తాపంతో పశువులకు వాడే పిడుదల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన గురువారం పుంగనూరు మండలంలో జరిగింది. బాధితుల కథనం మేరకు.. మండలంలోని బసినేపల్లెకు చెందిన సుందరం కుమారుడు హేమంత్(22)ను తల్లిదండ్రులు పనులు చేయలేదని మందలించడంతో మనస్తాపానికి గురై ఇంట్లో పశువుల కోసం తెచ్చిన పిడుదల మందును తాగాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం పుంగనూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించగా అతని పరిస్థితి విషమంగా ఉందని డాక్టర్ల సూచనల మేరకు మదనపల్లె ఆస్పత్రికి తరలించారు.

గ్రామాల్లో రెవెన్యూ వివాదాలను పరిష్కరించాలి / డీఎల్ఎస్ఏ సెక్రటరీ భారతి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ సెక్రటరీ భారతి

యాదమరి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న రెవెన్యూ వివాదాలను పరిష్కరించడానికి అధికారులు కృషి చేయాలని డీఎల్ఎస్ఏ (జిల్లా లీగల్ సర్వీస్ అథారిటీ) సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి భారతి సూచించారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో తహసీల్దార్, మండల స్థాయి అధికారులతో ఆమె సమావేశమయ్యారు. చాలామంది భూవివాదాలతో కోర్టుల చుట్టూ తిరుగుతూ ఉంటారని చెప్పారు. ఇటువంటి వారికి సులభంగా న్యాయం అందించడానికి లోక్‌అదాలత్ మంచి వేదిక అని తెలిపారు. అనంతరం యాదమరి జడ్పీ హైస్కూల్‌లో యాదమరి వడ్రంగి యూనియన్ నాయకులతో సమావేశమయ్యారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారం చూపాలని సూచించారు. తహసీల్దార్ పార్థసారథి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

టీచర్‌కు సన్మానం



బంగారుపాళ్యం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): ముంగరమడుగు ప్రాథమిక పాఠశాల టీచర్‌గా పనిచేస్తూ మొగిలిమిట్టూరుకు బదిలీపై వెళుతున్న అనితాదేవిని గురువారం గ్రామస్తులు సన్మానించారు. సర్పంచు కుమారి, హెచ్‌ఎం ప్రభాకర్ నాయుడు, టీచర్ మునిరత్నం, విద్యార్థులు పాల్గొన్నారు.

16నుంచి శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు

బంగారుపాళ్యం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): మండలం కేంద్రంలోని రాజావీధిలో ఈనెల 16 నుంచి 20వ తేదీవరకు త్రైత సిద్ధాంతం - ప్రబోధానంద సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకులు బాలాజి, రామారావు, ధనంజయ, వాణిశ్రీ, లత, రెడ్డెమ్మ గురువారం ఒక తెలిపారు. చివరి రోజున మండల కేంద్రంలో శ్రీకృష్ణుడి చిత్రపటాన్ని ఊరేగిస్తామన్నారు. దీనికి సంబంధించిన ఆహ్వాన పత్రికను గురువారం సీఐ కత్తి శ్రీనివాసులుకు అందజేశారు.

పీఏసీఎస్ డైరెక్టర్‌కి సత్కారం



వెదురుకుప్పం, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం పీఏసీఎస్ డైరెక్టర్‌గా నియమితులైన చంద్రగిరి చెంగల్రాయులును గురువారం ఆర్కేవీబీపేట గ్రామస్తులు, టీడీపీ కార్యకర్తలు సత్కరించారు.

విద్యుత్‌శాఖ ఏవో బాధ్యతల స్వీకరణ



బాలు

చిత్తూరు రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖ అకౌంట్స్ ఆఫీసర్(ఏవో)గా బాలు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడున్న ఏవో ప్రసన్న అంజనేయులు పదోన్నతిపై బదిలీ అయ్యారు. కాగా, గతంలో తాను ఇక్కడే డివిజన్ జేఏవోగా పనిచేసినట్లు బాలు తెలిపారు.

వర్షాలకు దెబ్బతిన్న బీరతోట



యాదమరి, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): రెండ్రోజులుగా మండలంలో కురుస్తున్న వర్షాలకు కుక్కలపల్లె గ్రామానికి చెందిన రైతు గిరి సాగు చేసిన బీరతోట పూర్తిగా దెబ్బతిన్నది. పంట చేతికొచ్చే సమయంలో ఇలా జరగడంతో సుమారు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నాడు.

ప్రభుత్వాస్పత్రిలో టీవీ చోరీ

పుంగనూరు రూరల్, ఆగస్టు 7 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలోని చిన్నపిల్లల వార్డులో ఏర్పాటు చేసిన ఎల్ఈడీ టీవీ బుధవారం రాత్రి చోరీకి గురైంది. గురువారం ఉదయం వచ్చిన సిబ్బందికి టీవీ కనిపించకపోవడంతో మెడికల్ ఆఫీసర్ డాక్టర్ హరిగోపాల్‌కు విషయాన్ని తెలిపారు. ఆయన సీసీ కెమెరాలను పరిశీలించగా ఆస్పత్రిలో పనిచేసే ఓ కాంట్రాక్ట్ ఉద్యోగి తీసుకెళ్లినట్లు గుర్తించారు. అతడిని పిలిపించి మందలించడంతో ఆ ఉద్యోగి వెంటనే టీవీని తిరిగి తీసుకొచ్చి వార్డులో ఉంచాడు.